
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

7

సోమవారం 28 అక్టోబరు 2024

ఆట పాటలతో.. ఆనందమయ జీవితం గడపాల్సిన చిన్నారులు పెళ్లిపీటలు ఎక్కుతున్నారు. బరువులు, బాధ్యతలు, భయాలు తెలియని ప్రాయం కుటుంబ బాధ్యతల్లో విలవిల్లాడుతోంది. బాదర బందీ లేని ప్రాయం కుటుంబ చట్రంలో పడి నలిగిపోతోంది. చీకూచింత లేకుండా, హాయిగా చదువుకుని బంగారు భవిష్యత్తును ఎంచుకోవాల్సిన చిన్నారులు మూడుముళ్ల బందీఖానాలో మగ్గిపోతున్నారు. ఆధునిక కాలంలోనూ బాల్యవివాహాల సామాజిక దురాచారం ముక్కుపచ్చలారని చిన్నారులను బలిచేస్తోంది. పెళ్లంటే ఏమిటో కూడా తెలియకుండానే చిన్నారుల జీవితాలు శిథిలమైపోతున్నాయి. విద్యా కేంద్రమైన గుంటూరులాంటి జిల్లాలో కూడా బాల్య వివాహాలు భారీగా నమోదవుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఎక్కడికక్కడ అధికారులు అడ్డుకుంటున్న బాల్య వివాహాలు పదుల సంఖ్యలో ఉండగా ఇక వారికి తెలియకుండా జరుగుతున్నవి ఎన్నో ఎవరికీ అంతుచిక్కడం లేదు.





బాల్యం.. బందీఖానా

- మూడు ముళ్ల'బంధ'నంలో బాలికలు
- సంరక్షణ భయంతోనే పెళ్లిబాటలో తల్లిదండ్రులు
- గడిచిన ఐదేళ్లలో ఆందోళనకర స్థాయిలో పెరుగుదల
- పట్టణ ప్రాంతాల్లోనూ నమోదవుతున్న బాల్య వివాహాలు
- అత్యధిక బాల్య వివాహాలు జరిగే జిల్లాల్లో నాలుగో స్థానంలో ఉమ్మడి గుంటూరు



గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆటపాటలు.. కేరింతలు.. గిల్లికజ్జాలు.. ఇలా ఎన్నో మధురానుభూతుల్లో సాగాల్సిన బాల్యం వివాహ బంధంలో బందీగా మారిపోతోంది. ఎప్పుడో 150 ఏళ్ల క్రితం 1872లోనే బాల్య వివాహాలను రద్దు చేస్తూ అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం చట్టం చేసినా అది నేటి ఆధునిక సమాజాన్ని కూడా వీడలేదు. బాల్య వివాహాల సంఖ్య ఇటీవల కాలంలో భారీగా పెరుగుతుండడం సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. కొవిడ్ తర్వాత బాల్య వివాహాల సంఖ్య గణనీయంగా పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. ఏదో ఒక వివాదం జరిగి, ఎవరైనా ఉద్దేశ పూర్వకంగా ఫిర్యాదు చేస్తే తప్ప బాల్య వివాహాల విషయం అధికారుల వరకూ రావడం లేదన్నది వాస్తవం. ఏది ఏమైనప్పటికీ గడిచిన నాలుగేళ్లలో బాల్య వివాహాల దురాచారం విపరీతంగా పెరిగింది. గ్రామీణ ప్రాంతాల విషయం ఎలా ఉన్నా, పట్టణ ప్రాంతాల్లో ఈ మహమ్మారి జడలు విప్పి కోరలు చాచి చిన్నారుల జీవితాలను వివాహ బంధనాల్లోకి లాగేస్తోంది. ఐదో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం రాష్ట్రంలోని మహిళల్లో ప్రస్తుతం 20 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న యువతుల్లో 29.3 శాతం మంది బాల్య వివాహాలు చేసుకుంటున్నారని తేలింది. వీరిలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు 32.9 శాతం ఉండగా, పట్టణ ప్రాంతాలకు చెందిన మహిళలు 21.7 శాతం ఉన్నారు. వీరిలో 12.6 శాతం మహిళలు 15 నుంచి 19 ఏళ్లలోపే గర్భం దాల్చారు. తగిన వయసు, శారీరక ఎదుగుదల లేకుండానే వీరు గర్భిణులుగా మారడంతో వీరి ప్రాణాలు ప్రమాదంలో పడిపోయాయి. బాల్య వివాహాలపై ఐసీడీఎస్ కృషి చేస్తున్నప్పటికీ అది ఏమాత్రం సరిపోవడం లేదన్నది గణాంకాల ద్వారా వెలికి తెలుస్తున్న వాస్తవం. ప్రజల్లో అవగాహన పెంచి, భయం పోగొట్టి, మహిళలకు, ఆడపిల్లల భద్రతకు భరోసా ఇచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకుంటే తప్ప బాల్య వివాహాలు అడ్డుకోవడం కష్టమని నిపుణులు చెబుతున్నారు.

బాల్య వివాహాలు 35.4 శాతం

బాల్య వివాహాల రాష్ట్ర సగటు 29.3 శాతం. అయితే రాష్ట్రంలోని ఉమ్మడి గుంటూరు జిల్లాలో అంతకు మించి బాల్య వివాహాలు జరుగుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే లెక్కల ప్రకారం 2019- 20లో 35.4 శాతం బాల్య వివాహాలు జరిగాయి. ఇది రాష్ట్ర సగటు కంటే 6 శాతం అధికం.

పని చేయని చట్టాలు

బాల్య వివాహాల రద్దు కోసం ప్రభుత్వం అనేక చట్టాలు చేస్తోంది. 1872లో అప్పటి గవర్నర్ జనరల్ మేయో తొలిసారి బాల్య వివాహాల రద్దు చట్టం చేశారు. ఆ తరువాత 1929లో లార్డ్ ఇర్విన్ కాలంలో 'శారద' చట్టం చేశారు. తాజాగా 2006లో ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మేరేజెస్ యాక్ట్ 2006ను చేశారు. ఈ చట్టం ప్రకారం ఆడపిల్లల వివాహ వయసు 18, మగపిల్లల వివాహ వయసును 21గా నిర్ణయించింది. కాగా కిందటేడాది ఈ చట్టాన్ని సవరించి ఇద్దరి వయసును 21 ఏళ్లకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయినా బాల్య వివాహాలు ఆగడం లేదు.

భయమే కారణం

గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరగడానికి కారణం అవిద్య అవగాహనాలేమి కారణాలుగా కనిపిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో తల్లిదండ్రుల సమస్య వేరేలా ఉంది. సినిమా, టీవీల దుష్ప్రభావాలు, లైంగిక వేధింపులు, అత్యాచారాల నుంచి బయట పడేందుకు తక్కువ వయసులో పెళ్లిళ్లకు తల్లిదండ్రులు పూనుకుంటున్నారు. సమాజాన్ని ఆవరించిన అభద్రతా భావం ఆడపిల్లలకు శాపంగా మారింది.

వివిధ స్థాయిల్లో కమిటీలు..

బాల్య వివాహాలను అడ్డుకునేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో డివిజన్ అధికారి, సబ్ కలెక్టర్లు బాల్య వివాహ నిరోధక అధికారులుగా వ్యవహరిస్తారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సీడీపీవో ప్రాజెక్టు స్థాయిలో 3 నుంచి 5 మండలాలకు ఒక బాలల అభివృద్ధి ప్రాజెక్టు అధికారి, మండల స్థాయిలో సంబంధిత తహసీల్దార్ పనిచేస్తారు. గ్రామాల్లో సర్పంచి, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, స్థానిక ఉపాధ్యాయురాలు, మహిళా వార్డు మెంబర్లు, స్వచ్ఛంద సంస్థ, యువజన సమాఖ్య సభ్యుడు, ఆరోగ్య, అంగన్వాడీ కార్యకర్తలు బాల్య వివాహ నిరోధక కమిటీలో సభ్యులుగా ఉంటారు. వీరంతా బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను ఆయా ప్రాంతాల్లో తెలియచేస్తూ తల్లిదండ్రుల్లో అవగాహన పెంచుతారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే అడ్డుకుంటారు. అయితే ఈ కమిటీలు నామమాత్రంగా మారిన కారణంగా బాల్య వివాహాల సంఖ్య ఇటీవల కాలంలో ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి.

అడ్డుకుంటున్నా ఆగని బాల్య వివాహాలు

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ బాల్య వివాహాలను ఎక్కడికక్కడ అడ్డుకుంటుంది. అయితే అధికారులకు సమాచారం అంది లేదంటే తెలిసి అడ్డుకున్న కేసుల సంఖ్య ఏటికేడాది పెరుగుతున్నాయి. ఇక వారికి తెలియకుండా జరుగుతున్న పెళ్లిళ్లు ఎన్నో అంతుబట్టడంలేదు. దీనిని బట్టి అధికారులు అడ్డుకుంటున్నా బాల్య వివాహాలు ఆగడంలేదని తెలుస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2018లో 31 బాల్య వివాహాలను ఐసీడీఎస్ అధికారులు అడ్డుకోగా అది 2019 నాటికి 23కు తగ్గింది. అయితే కొవిడ్ ప్రభావం మొదలైన 2020లో 34 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకోగా, 2021లో ఆ సంఖ్య 37కు చేరింది. ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే 12 బాల్య వివాహాలను అడ్డుకున్నారు. 2022 జిల్లాల పునర్విభజన తర్వాత ఒక్క గుంటూరు జిల్లాలో ఇప్పటి వరకూ 48 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకోగా 2022లో 32, 2023లో 16, ఈ ఏడాది తొలి 8 నెలల్లో 16 కేసులు నమోదయ్యాయి. పల్నాడు జిల్లాలో 21 బాల్య వివాహాలు ఆపగా, 2022లో 12, 2023లో 9, బాపట్ల జిల్లాలో ఇప్పటి వరకూ 29 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. అయితే క్షేత్రస్థాయిలో ఈ సంఖ్య పదుల రెట్లు ఎక్కువగా ఉండవచ్చని సమాచారం.

బాల్య వివాహాలతో నష్టాలెన్నో:

- బాల్య వివాహాల వల్ల పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల దెబ్బతింటుంది.
- సామాజిక, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా పరిపూర్ణ వ్యక్తులుగా ఎదిగేందుకు అవకాశం, స్వేచ్ఛ లేకుండా పోతుంది.
- చిన్న వయసులోనే గర్భం దాలిస్తే తల్లీబిడ్డలకు ప్రమాదమే.
- పిల్లలు తక్కువ బరువుతో పుట్టడం, పౌష్టికాహార లోపం, రక్తహీనత వంటి ఆరోగ్య సమస్యలు వెంటాడతాయి.
- బాలికల విద్యాహక్కును ఇది కాలరాస్తుంది. పిల్లలు నిరక్షరాశ్యులుగా, నైపుణ్యం లేనివారుగా మిగిలిపోతారు.



కౌలుకు మంచి రోజులు

- సీసీఆర్ కార్డుల ప్రామాణికంగా రైతులకు రుణాలు
- నిబంధనల విషయంలో సడలింపు ఇచ్చే దిశగా కసరత్తు
- క్షేత్రస్థాయిలో కౌలురైతుల సమస్యల పరిష్కారం.. లబ్ధిపై దృష్టి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

కౌలు రైతులు.. కష్టాలు కలిసి ఉంటాయి. నష్టం, కష్టమైనా సాగును మాత్రం వీరు వీడరు. కౌలు రైతులు ప్రధానంగా పెట్టుబడి కోసం తీవ్రంగా ఇబ్బందులు పడుతుంటారు. అదే విధంగా ప్రభుత్వ పథకాలకు నోచుకోక నష్టపోతుంటారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు మంచి రోజులు తీసుకువచ్చేందుకు సిద్ధమైంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో అరకొర రుణాలతో విసిగి వేసారిన కౌలు రైతులు కూటమి ప్రభుత్వంపై గంపెడాశలు పెట్టుకున్నారు. ఈ క్రమంలో సీసీఆర్ కార్డుల జారీతో పాటు రుణాల మంజూరుపై జిల్లాల వారీగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కూడా జారీ చేసిన సీసీఆర్సీ కార్డులకు అందించిన రుణాలకు హస్తిమశకాంతం తేడా ఉండడంతో ఈ పరిస్థితి మారాలని తాజాగా జరిగిన బ్యాంకర్ల సమావేశంలో ఆదేశాలిచ్చింది. ఇప్పటికే ఖరీఫ్ రుణాల విషయంలో లక్ష్యాన్ని చేరుకున్నామని బ్యాంకులు ఊదరగొడుతున్నప్పటికీ వాటిలో కౌలు రైతుల వాటా తీసికట్టుగా ఉండడంపై సమీక్ష జరిపింది. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కౌలు రైతులకు రుణాల విషయంలో మరింత మందికి న్యాయం జరిగేలా అడుగులు పడనున్నాయి. ఏటా బ్యాంకర్లు ప్రకటించే వార్షిక పద్దులో 5 శాతం మొత్తాన్ని కౌలు రైతులకు రుణాలుగా

(మిగతా 10వ పేజీలో..)



- కేవలం 3.38 గంటల్లోనే 257 కి.మీ ప్రయాణం
- గంటన్నర ముందుగానే గమ్యస్థానానికి చేరుతున్న రైళ్లు
- గతంలో ఐదు నుంచి ఆరు గంటల సమయం
- సమయ పట్టిక సవరించాల్సిన పరిస్థితి ఉత్పన్నం



పల్నాడు మార్గంలో పెరిగిన రైళ్ల వేగం

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - నంద్యాల సెక్షన్‌లో రైళ్ల ప్రయాణ వేగం గణనీయంగా పెరిగింది. దిగువమెట్ట వద్ద ఘాట్ సెక్షన్ మినహా అంతా రెండు వరసల మార్గం నిర్మాణం పూర్తికావడంతో ఈ రూట్‌లో రైళ్ల క్రాసింగ్‌ల సమస్య తప్పింది. అంతేకాకుండా గంటకు 120 కిలోమీటర్ల వేగంతో రైళ్లు ప్రయాణిస్తుండటంతో ముందుగానే గమ్యస్థానానికి చేరుకొని షెడ్యూల్ ప్రకారం బయలుదేరే సమయం కోసం లూప్‌లైన్‌లో నిరీక్షించాల్సిన పరిస్థితి. అయినప్పటికీ రైల్వే శాఖ టైంటేబుల్‌ని సవరించడం లేదు. ప్రధాన రైల్వేస్టేషన్లలో ఎక్కువ సమయం లూప్‌లైన్‌లో పెట్టడం వలన గూడ్స్ ట్రాఫిక్‌కి

(మిగతా 10వ పేజీలో..)



నంద్యాల మార్గంలో అత్యంత వేగంగా ప్రయాణించిన ఎస్ఎస్‌పీఎన్ ఎక్స్‌ప్రెస్

పారిశుధ్యం, తాగునీటికి... అధిక ప్రాధాన్యం

- డిసెంబరులోగా నగరంలో అన్ని రహదారులకు మరమ్మతులు
- రూ.152 కోట్లతో పీవీకే నాయుడు మల్టీ లెవెల్ మార్కెట్ నిర్మాణం
- అసంపూర్తిగా ఉన్న యూజీడీ పనులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లా
- 'ఆంధ్రజ్యోతి'తో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



8

మిర్చియార్డు పర్సన్ ఇన్‌ఛార్జ్, సెక్రటరీలకు... ఎన్నెన్నో సవాళ్లు

- జీరో, రేట్ కటింగ్ బిజినెస్‌లకు అడ్డుకట్ట వేయాలి

నేడు డీఆర్‌సీ మీటింగ్

- కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి సమావేశం

10

ఆధునికీకరణకు.. ఆపసోపాలు


- కాగితాల్లోనే బుగ్గవాగు సామర్థ్యం పెంపు
- పదేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైన పనులు
- పాలకులకు పట్టని ప్రజల సాగు.. తాగునీటి కష్టాలు
- బుగ్గవాగుపైనే జలజీవన్ మిషన్, వాటర్‌గ్రిడ్‌ల ఆధారం
- కూటమి ప్రభుత్వం స్పందిస్తేనే నీటి సమస్యకు పరిష్కారం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వాలు మారుతున్నాయి.. పాలకులు వస్తున్నారు పోతున్నారు.. మేము తప్ప మరెవ్వరూ చేయలేరు అంటున్నారు.. అయినా నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలోని బుగ్గవాగు ఆధునికీకరణ దశాబ్దాలుగా కాగితాలకే పరిమితమైంది. నాగార్జున సాగర్ కుడికాల్వ పరిధిలో ఏడాది పొడవునా పల్నాడు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ప్రజలకు తాగునీటి సమస్య తీర్చే అవకాశం ఉంటుంది. అయినా బుగ్గవాగు విస్తరణ పనులకు నడుంకట్టిన వారు లేరు. పాలకులు మారినప్పుడల్లా బుగ్గవాగు అంశాన్ని ప్రస్తావిస్తున్నారే తప్ప సామర్థ్యం పెంపుపై దృష్టి సారిస్తున్న దాఖలాలు లేవు. పదేళ్లుగా పనులు ప్రతిపాదలనకే పరిమితమయ్యాయంటే పాలకుల చిత్తశుద్ధిని తెలియజేస్తుంది. పాలకులు ఎవరికి వారు తామే బుగ్గవాగు సామర్థ్యం పెంచి ప్రజల నీటి కష్టాలను తీరుస్తామని గొప్పగా ప్రకటనలు చేస్తున్నారే తప్ప ఆచరణ శూన్యంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో బుగ్గవాగు అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. బుగ్గవాగు సామర్థ్యం పెంచితే సాగు, తాగునీటి అవసరాల కొంత తీర్చే వెసులుబాటు ఉంటుంది. 3300 ఎకరాల్లో విస్తరించిన జలాశయాన్ని లోతు పెంచడం, కట్టలు ఎత్తు పెంచి వాటిని బలోపేతం చేయడం ద్వారా సామర్థ్యం పెంచవచ్చు. వరదల సమయంలో నీటిని బుగ్గవాగులో నిల్వ చేయడం ద్వారా అదనంగా నాలుగు టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుంది. పంటలకు.. తాగుకు అత్యవసర పరిస్థితుల్లో బుగ్గవాగు నుంచి నీటి వినియోగించుకునే వీలు ఉంటుంది. బుగ్గవాగు సామర్థ్యం పెంపుపైనే తాగునీటి పథకాలు ఆధారపడి ఉన్నాయి. బుగ్గవాగు సామర్థ్యం పెంచితే ఏడాది పొడవునా ప్రజలకు తాగునీరు పుష్కలంగా అందించే అవకాశం ఉంటుంది. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జలజీవన్ మిషన్ పథకం లక్ష్యం నెరవేరుతుంది. రూ.150కోట్లతో చేపట్టిన పల్నాడు వాటర్ గ్రిడ్ పథకం కూడా బుగ్గవాగుపైనే ఆధారపడి ఉంది.

వైసీపీ హయాంలో ఆర్భాటంతో సరి..

బుగ్గవాగు సామర్థ్యాన్ని 3.5 టీఎంసీల నుంచి 7 టీఎంసీలకు పెంచుతామని వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. అయితే ఐదేళ్లలో కార్యరూపం దాల్చలేదు. ప్రాజెక్టు పనుల వ్యయం అంచనాలు రూపొందించేందుకే ఆపసోపాలు పడింది. బుగ్గవాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ దుర్గి ప్రాంతంలో కుడి కాల్వ 27 నుంచి 33వ కిలోమీటర్ మధ్యలో ఉంది. దీని నీటి నిల్వ సామర్థ్యం 3.46 టీఎంసీలు. డెడ్ స్టోరేజి 1.69 టీఎంసీలు కాగా 1.77 టీఎంసీల నీటిని వినియోగించుకోవచ్చు. రిజర్వాయర్‌ను 3.46 టీఎంసీల నుంచి 4.77 టీఎంసీలకు పెంచాలని గతంలో టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు నిపుణుల కమిటీ కూడా నాడు ఆమోదం తెలిపింది. రూ.424 కోట్ల వ్యయం అవుతుందని అంచనాలు రూపొందించారు. రూ.202కోట్లు మంజూరు చేశారు. ఆ పనులు చేపట్టక పోగా 3.46 టీఎంసీల నుంచి 7 టీఎంసీలకు సామర్థ్యాన్ని పెంచుతామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించి డీపీఆర్ రూపొందించాలని జలవనరుల శాఖను ఆదేశించింది. 2020 అక్టోబరులో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించగా మధ్యలోనే ఆ ప్రక్రియ నిలిచిపోయింది. మరోమారు డీపీఆర్‌కు ప్రయత్నించినా అది ముందుకు సాగలేదు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం బుగ్గవాగు సామర్థ్యం పెంపునకు సంబంధించిన పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే బుగ్గవాగు ఆధునికీకరణ పనులను త్వరతగితిన చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం ఏ విధంగా కృషి చేస్తుందో చూడాలి.



బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి కుడి కాల్వకు నీటి సరఫరా

పారిశుద్ధ్యం, తాగునీటికి... అధిక ప్రాధాన్యం

- డిసెంబరులోగా నగరంలో అన్ని రహదారులకు మరమ్మతులు
- రూ.152 కోట్లతో పీవీకే నాయుడు మల్టీ లెవెల్ మార్కెట్ నిర్మాణం
- అసంపూర్తిగా ఉన్న యూజీడీ పనులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లా
- 'ఆంధ్రజ్యోతి'తో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో పారిశుద్ధ్యం, తాగునీరు, రోడ్లు, వీధి దీపాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు నగర మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన " ఆంధ్రజ్యోతి" నిర్వహించిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరు నాటికి నగరంలో అన్ని రోడ్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు, కొత్త రోడ్లు ఏర్పాటు పూర్తి అవుతాయన్నారు. రూ.152 కోట్లతో పీవీకే నాయుడు మల్టీ లెవెల్ మార్కెట్ నిర్మాణం చేపడతామన్నారు. నగరంలో అసంపూర్తిగా ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైయినేజి (యూజీడీ) పనులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో ఈ పనులు కూడా ప్రారంభించేందుకు అవకాశం ఉందన్నారు. నగరంలో 1100కు పైగా భవన నిర్మాణాలకు షార్ట్ ఫాల్స్ ఉన్నాయని, ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేస్- 3 త్వరలో పూర్తి చేస్తామన్నారు. నగరంలో ఫుడ్ కోర్టులు, రైల్వే బ్రిడ్జిల పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు. నగరంలోని అనేక అంశాలపై ఆయన **ప్రత్యేక ఇంటర్వ్యూ.**

● గుంటూరు అభివృద్ధిలో మీ ప్రణాళిక ఏమిటి?

కమిషనర్: ప్రధానంగా శానిటేషన్, తాగునీరు, రోడ్లు, వీధి దీపాల మెరుగుదలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ముఖ్యంగా 90 రోజుల స్పెషల్ శానిటేషన్ చేపట్టి, 22 మంది ప్రత్యేక అధికారులను నియమించి, వారి ద్వారా ఈ పనులను పర్యవేక్షిస్తున్నాం. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నాం. వర్కర్స్‌ని పూర్తిగా రేషనలైజేషన్ చేసి, వాహనాలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు పూర్తి చేస్తాం.

● శివారు గ్రామాల తాగునీటి సమస్య ఎలా పరిష్కరిస్తారు?

కమిషనర్: అమృత్ పథకం1, 2ల ద్వారా ప్రత్యేక నిధులు రాబడతాం. ఏఐఐబీ(ఏషియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంక్) ద్వారా ఈ మూడు పథకాలకు నిధులు సాధించి, 10 విలీన గ్రామాలకు, శివారు ప్రాంతాలకు కొత్త పైపులైను ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తాం.

● వెన్ లాక్, పీవీకే నాయుడు మార్కెట్ అభివృద్ధి ఎలా?

కమిషనర్: కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ముగ్గురు ఎమ్మెల్యేల సహకారంతో వీవీకే నాయుడు మార్కెట్‌ను రూ.152 కోట్లతో అభివృద్ధి చేయబోతున్నాం. జీఎంసీ, ఎస్‌బీఐ రుణ సదుపాయాలతో ముందుకెళ్తున్నాం. టెండర్లు ఫైనల్ కావచ్చాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం.

● పార్కులు, చెరువుల అభివృద్ధి ఎలా?

కమిషనర్: ఏపీ గ్రీన్‌నింగ్ కార్పొరేషన్ ద్వారా బుడంపాడు, కొరిటిపాడు, నల్లపాడు చెరువులను, వాకింగ్ ట్రాక్‌లను అభివృద్ధి చేస్తున్నాం. నగరంలో చిన్న, చిన్న పార్కులను సీఎస్ఆర్ ఫండ్స్, స్థానికంగా దాతలు విరాళాలతో జీఎంసీ నిధులు జోడించి అభివృద్ధి చేస్తాం.

● ఎన్టీఆర్ మానస సరోవరం పార్క్‌కు నిధులు?

కమిషనర్: కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని సహకారంతో ఎమ్మెల్యేల ద్వారా అంతర్జాతీయ సామర్థ్యం గల ప్రాజెక్టు తీసుకొచ్చేందుకు ప్రత్యేక ప్రణాళికల రూపొందిస్తున్నాం.

● పీకల వాగు ఆక్రమణల పరిస్థితి ఏమిటి?

కమిషనర్: ఈ వాగులో ఉన్న గార్బేజ్ తొలగించాలంటే ఇబ్బందిగా ఉంది. కొన్నిచోట్ల అవకాశం లేదు. దాదాపుగా ఈ వాగు ఆక్రమించుకుని నిర్మాణం చేపట్టి వారంతా హౌసింగ్ స్కీం కింద ఎంపిక చేయబడ్డారు. పరిశీలించి త్వరలో నోటీసులు ఇచ్చి తొలగిస్తాం.

● నగరంలో 24 గంటల తాగునీటి సరఫరా పరిస్థితి ఏమిటి?

కమిషనర్: రానున్న రెండు నెలల్లో గోరంట్ల కొండపైన చేపట్టిన తాగునీటి పథకం పూర్తి చేసి, పైమూడు పథకాల ద్వారా నిధులు రాబట్టి, గుంటూరు నగర ప్రజలకు 24 గంటలు తాగునీటి సరఫరాను ఖచ్చితంగా అందిస్తాం.

● విజయవాడ బీసెంట్ రోడ్ లాగా కొన్ని రోడ్లు మారుస్తారా?

కమిషనర్: ఖచ్చితంగా మారుస్తాం. ఇందుకోసం ప్రత్యేక ప్లానింగ్ కూడా ఉంది. త్వరలో అమలు చేస్తాం.

● స్టేడియంల అభివృద్ధికి నిధులు ఎలా?

కమిషనర్: వీటి అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక డీపీఆర్‌లను సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వానికి కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని, ఎమ్మెల్యేల ద్వారా నివేదించి, ప్రత్యేక నిధులు రాబడతాం.

● గుజ్జనగుండ్ల నుంచి పేరేచర్ల వరకు సెంట్రల్ లైటింగ్ అమర్చే అవకాశం ఉందా?

కమిషనర్: ఈ రోడ్డు ఆర్అండ్‌బీ వాళ్లది. జీఎంసీ పరిధి వరకు మాత్రమే రోడ్డు అభివృద్ధి పరిచి, సెంట్రల్ లైటింగ్, డివైడర్లను ఏర్పాటు చేస్తాం.

● గ్రీన్ గ్రేస్‌లో ఫ్లాట్లు కొన్న వారి పరిస్థితి ఏమిటి?

కమిషనర్: జీఎంసీ నుంచి అన్ని రకాల అనుమతులు, నాణ్యతా ప్రమాణాలు, లీగల్‌గా నిర్ధారించుకున్న తర్వాతే ఫ్లాట్లు కొనుగోలుదారులు ముందుకు వెళ్లాలి. లేకపోతే ఇబ్బందులు పడతారు. కొనుగోలుదారులకు నా మనవి ఏమిటంటే మీరు కొనుగోలు చేసే అపార్ట్‌మెంట్లకు 'ఫైనల్ ప్లాన్' ఉన్నది లేనిది చూసుకోవాలి. అప్పుడే కొనుగోలు చేసుకోవాలి.

● నగరంలో యూజీడీ పరిస్థితి ఏమిటి?

కమిషనర్: నగరంలో యూజీడీ మెరుగుదలకు ప్రభుత్వం ఒక ఆలోచన చేస్తుంది. రివ్యూల సమావేశంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. దీనిపై త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటారు.

● మాయాబజార్‌ను చక్కదిద్దే అవకాశం ఉందా?

కమిషనర్: డ్రైన్ నిర్మాణంపై ఉన్న అడ్డంకులను తొలగిస్తాం. మాయాబజార్ ను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.

● ఆటోనగర్‌కు మౌలిక సదుపాయాలు?

కమిషనర్: ఏపీఐఐసీ వాళ్ల పరిధిలో ఆటోనగర్ ఉంది. మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకుంటాం. నీటి మీటర్లను ఏర్పాటు చేసి, తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తాం. అయితే కుళాయి కనెక్షన్‌కు సంబంధించి రేట్లు తగ్గించాలని స్థానికుల నుంచి వినతి పత్రం వచ్చింది. కౌన్సిల్లో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటాం.

● అనుమతుల్లేని అపార్ట్‌మెంట్లపై చర్యలు ఏమిటి?

కమిషనర్: గుంటూరు నగరంలో 1100కు పైగా నిర్మాణాలకు టౌన్ ప్లానింగ్ నుంచి షార్ట్ ఫాల్స్ ఉన్నట్లు గుర్తించాం. వారందరికీ నోటీసులు జారీ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోబోతున్నాం.

● నైట్ ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేస్తారా?

కమిషనర్: నైట్ ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తాం. స్టేక్ హోల్డర్స్‌తో మీటింగ్ ఏర్పాటు చేసి, రవాణాకు అడ్డులేకుండా బ్రాడీపేట, పట్టాభిపురం, లక్ష్మీపురం, మార్కెట్ వంటి అనేక ప్రాంతాల్లో పరిశీలన చేస్తున్నాం. త్వరలో దీనిపై ఒక నిర్ణయం తీసుకుంటాం.

● మీ హయాంలో క్లీన్, గ్రీన్ గుంటూరు చూడవచ్చా?

కమిషనర్: ఖచ్చితంగా చూడవచ్చు. సాధ్యమైనంత వరకు అందరిని కలుపుకొని క్లీన్ గుంటూరు, గ్రీన్ గుంటూరు సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం.

● విజయవాడ, విశాఖపట్నం లాగా రైతు బజార్లు ఏర్పాటు చేస్తారా?

కమిషనర్: ఇప్పటికే నగరంలో కొల్లి శారద మార్కెట్, పీవీకే నాయుడు మార్కెట్లు ఉన్నాయి. వాస్తవంగా నగరంలో రైతు బజార్లను మార్కెటింగ్ శాఖ పర్యవేక్షణలో ఉంటాయి. ఆ శాఖ అధికారులతో చర్చించి నగరంలో ఆధునాతనంగా విజయవాడ, విశాఖపట్నం తరహాలో రైతు బజార్లో ఏర్పాటుకు ప్రయత్నం చేస్తాం.

● మరిన్ని ఫ్లైఓవర్లు వచ్చే అవకాశాలు ఉన్నాయా?

కమిషనర్: ఇప్పటికే కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని సహకారంతో శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.98 కోట్ల మంజూరయ్యాయి. త్వరలో శ్యామల నగర్, గడ్డిపాడు, నెహ్రూనగర్, సంజీవయ్య నగర్ రైల్వే బ్రిడ్జిలను కూడా మంజూరు చేయించుకునే అవకాశాలు ఉన్నాయి.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరుగుతున్న వాగ్గేయకార మహోత్సవాలు ముగిశాయి. ఆదివారం కార్యక్రమాలను డాక్టర్ వై శైలజ, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రధాన కచేరీలో భాగంగా విదుషి కస్తూరి కమల దీప్తి, విశాఖపట్నం వారి శాస్త్రీయ సంగీత కచేరి శ్రావ్యంగా సాగింది. వీరికి వయోలిన్ పై మందా శ్రీ రమ్యచ మృదంగంపై బుర్రా శ్రీరామ్ వాయిద్య సహకారాన్ని అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ వై.వీ.కే దుర్గా ప్రసాదరావు హాజరై ప్రసంగించారు. అనంతరం కళాకారులను, అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్ని సంగీత మండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ పీ విజయ, ఏం. వై. శేషురాణి పర్యవేక్షించారు.

సరిదిద్దుకుంటూ జీవితాన్ని సాగించాలి



మాట్లాడుతున్న భారతీయం సత్యవాణి, వేదికపై నూతక్కి రామకృష్ణ ప్రసాదు, సామినేని, చుక్కపల్లి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జీవితంలో సర్దుకుపోవద్దు, చేస్తున్న పొరపాటులను సరిదిద్దుకుని ముందుకు సాగాలని భారతీయం సత్యవాణి అన్నారు. ఆదివారం గుంటూరు, కుందులరోడ్డులోని కమ్మజన బాలికల వసతి గృహంలో సేవా సమితి వారి 22వ తల్లిదండ్రుల సమావేశం జరిగింది. సమావేశానికి సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు అధ్యక్షత వహించగా, విశిష్ట అతిథిలుగా ప్రవాసాంధ్రుడు నూతక్కి రామకృష్ణ ప్రసాదు, పారిశ్రామిక వేత్త కారుమంచి ప్రసాదు హజరైయ్యారు. ఈ సందర్భంగా భారతీయం సత్యవాణి మాట్లాడుతూ పరిపక్వత లేని వయస్సులో వ్యామోహాలకు లోనుకావద్దని, దారి తప్పితే దాని దుష్ఫలితాలు జీవితాంతం అనుభవించాలని సూచించారు. బాలికల వసతి గృహానికి రూ.25 కోట్ల విరాళాన్ని అందజేస్తున్న నూతక్కి రామకృష్ణప్రసాదు అభినందనీయులని అన్నారు. నూతక్కి రామకృష్ణ ప్రసాదు మాట్లాడుతూ బాలికల వసతి గృహం నాకు ప్రాణంతో సమానమని, నూతన భవన సముదాయాన్ని పూర్తి చేయడమే లక్ష్యంగా పని చేస్తానని స్పష్టం చేశారు. సమితి అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ ఇంగ్లిషు భాషపై ప్రావీణ్యం సాధించాలని, లేకపోతే భవిష్యత్తులో సమస్యలు ఎదురవుతాయని సూచించారు. అనంతరం కారుమంచి ప్రసాదు, లియో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కంచేటి ప్రసన్నలక్ష్మి ప్రసంగించారు. దాతలు అందజేసిన రూ.30లక్షల విరాళాల్ని 300 మంది ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున పంపిణీ చేశారు. పాలకవర్గ సభ్యులు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి, వడ్లమూడి నాగేంద్రం, గోరంట్ల పున్నయ్య చౌదరి, కోటేశ్వరరావు, పెద్ది సాంబశివరావు, బుచ్చయ్య చౌదరి పాల్గొన్నారు.

ఏపీసీపీడీసీఎల్ డిస్కం నూతన కార్యవర్గం ఏకగ్రీవం

గుంటూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ అనుబంధ విభాగం తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం ఏపీ సీపీడీసీఎల్ డిస్కం పరిధిలో కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో విస్తరించిన సీపీడీసీఎల్ డిస్కం నూతన కార్యవర్గానికి అధ్యక్షుడుగా గుంటూరు నగరానికి చెందిన నార్నె శివరామకృష్ణప్రసాద్, కార్యదర్శిగా మోటుపల్లి శ్రీరామ్‌మూర్తి ఎన్నికయ్యారు. ఈ మేరకు నూతన కార్యవర్గ ఎన్నిక విజయవాడలోని టీడీపీ కార్యాలయంలో జరిగింది. నూతన కార్యవర్గం ఏడాది పాటు కొనసాగనున్నది. ఎన్ఎస్ఆర్కే ప్రసాద్ గతంలో గుంటూరు రీజనల్ నాయకుడిగా వ్యవహరించారు. సంఘంలో క్రియాశీలకంగా వ్యవహరించే ప్రసాద్ డిస్కం అధ్యక్షుడుగా ఎన్నికవటం అభినందనీయమని పలువురు నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం గుంటూరు సర్కిల్ కార్యాలయ అధ్యక్షుడు కొత్తపల్లి ఉమామహేశ్వరరావు, కార్యదర్శి రాయపాటి సీతారామయ్య నూతన అధ్యక్షుడు నార్నె శివరామకృష్ణప్రసాద్‌కు ఇతర కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర, జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

పొన్నూరుటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం బాపట్ల జిల్లా జమ్ములపాలెంకు చెందిన గోవిందమ్మ(63) అనే వృద్ధురాలు ఆదివారం పొన్నూరు మండలం ములుకుదురు గ్రామం బంధువుల ఇంటికి వచ్చింది. బంధువులను పరామర్శించిన అనంతరం తిరుగు ప్రయాణం కావటానికి జీబీసీ రోడ్డులో వేచి ఉంది. అదే సమయంలో బాపట్ల వైపు నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు అతి వేగంతో అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లో వేచి ఉన్న గోవిందమ్మను ఢీకొంది. ప్రమాదంలో గోవిందమ్మతోపాటు కారులోని వ్యక్తులకు గాయాలైనట్లు స్థానికులు వెల్లడించారు. గోవిందమ్మను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు సమాచారం. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సజావుగా ఏఎన్‌యూ దూరవిద్య పరీక్షలు ప్రారంభం

పెదకాకాని, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం నిర్వహిస్తున్న పీజీ, యూజీ పరీక్షలు ఆదివారం సజావుగా ప్రారంభమైనట్లు దూరవిద్య పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 114 పరీక్ష కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయని చెప్పారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని పరీక్షా కేంద్రాలకు పరిశీలకులను, ప్రత్యేక స్క్వాడ్ బృందాలను, రీజనల్ కోఆర్డినేటర్లను నియమించినట్లు రామచంద్రన్ తెలిపారు.

మిర్చియార్డు పర్సన్ ఇన్‌ఛార్జ్, సెక్రటరీలకు... ఎన్నెన్నో సవాళ్లు

- జీరో, రేట్ కటింగ్ బిజినెస్‌లకు అడ్డుకట్ట వేయాలి
- మచ్చుకాయలు బయటకు తీసుకెళ్లడాన్ని నియంత్రించాలి
- ప్రతీ మిర్చి టిక్కీ అకౌంట్ ఫర్ చేస్తే మార్కెట్‌కి ఆదాయం



మిర్చియార్డు

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు ప్రక్షాళనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవతేజ, సెక్రటరీగా వి.ఆంజనేయులను నియమించింది. వీరిలో ఇప్పటికే సెక్రటరీ బాధ్యతలు స్వీకరించగా పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా నేడో, రేపో జేసీ బాధ్యతలు చేపట్టనున్నారు. అయితే వీరిద్దరి ముందు ఎన్నో సవాళ్లు ఉన్నాయి. వాటిని సరిగా అధిగమించకపోతే యార్డులో అవినీతి, అక్రమాలను రూపుమాపలేని పరిస్థితి. ముఖ్యంగా ఆయా లోపాల మూలాలకు వెళ్లి వాటిని అధిగమించాలి. ప్రభుత్వం కొత్త పాలకవర్గం ఏర్పాటు చేసేలోపు యార్డు కార్యకలాపాలను గాడిన పెడితే అటు రైతులకు, ఇటు వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఎంతో మేలు జరుగుతుంది.

గతంలో అందినకాడికి దోచేశారు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మిర్చియార్డులో అనేక అక్రమాలు జరిగాయి. రైతుల బాగోగులను గాలికి వదిలేసి ఎంతసేపటికి స్వీయ అర్జన పైనే ఆ పార్టీ నేతలు దృష్టి పెట్టారు. నేతలు తెర వెనకుండి ఇక్కడి పాలకులను డమ్మీలుగా చేసి అందినకాడికి దోచేశారు. మిర్చియార్డుకు ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక నుంచి రైతులు మిర్చిని విక్రయించేందుకు తీసుకొస్తుంటారు. దీనివలనే రాష్ట్రంలోని అన్ని కమిటీల కంటే గుంటూరు ఏఎంసీకి అధిక ఆదాయం లభిస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ గుంటూరు మార్కెట్ కమిటీకే ఆదాయం అధికంగా ఉండేది. ఇక్కడి నుంచి వేరే కమిటీలకు రుణాలు ఇచ్చిన దాఖలాలు ఉన్నాయి. ఏఎంసీలో ట్రేడింగ్ జరిగిన మిర్చి దేశ, విదేశాలకు ఎగుమతి అవుతుండటం వలన అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతలు లభించాయి.

అడ్డుకట్ట వేస్తేనే ఆదాయం...

ఏటా దాదాపుగా రూ.20 వేల కోట్ల వరకు మిర్చి విక్రయాలు మార్కెట్ కమిటీ పరిధిలో జరుగుతుంటాయని అంచనా. అయితే గణాంకాల్లోకి మాత్రం ఇందులో సగమే వస్తుందని గతంలో మిర్చియార్డు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన మన్నవ సుబ్బారావు ఇటీవలే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదు చేశారు. ఇందుకు కారణం జీరో బిజినెస్. యార్డులో గేట్ ఎంట్రీ అవుతున్న మిర్చి టిక్కీలు, ఈనామ్‌లో ట్రేడింగ్ జరిగిన తర్వాత బయటకు వెళ్లిపోతున్న టిక్కీల లెక్కలు సమానంగా ఉండటం లేదు. దీనిని బట్టి ఈనామ్‌లో వాణిజ్యం జరగకుండానే భారీగా బయటకు వెళ్లిపోతున్నాయి. అలానే యార్డులో కొన్ని రకాల వెరైటీలను కొన్న ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేసినట్లు తక్ పట్టీలలో నమోదు చేస్తున్నారు. దీనినే రేట్ కటింగ్ బిజినెస్ అని యార్డు పరిభాషలో మాట్లాడతారు. ఈ రెండిటి వలన యార్డుకు మార్కెట్ ఫీజు రూపంలో రావాల్సిన ఆదాయానికి గండి పడుతున్నది. నేటికీ రూ. 100 కోట్ల మధ్యనే కమిటీకి వార్షికాదాయం సమకూరుతున్నది. రేట్ కటింగ్, జీరో బిజినెస్‌లకు కనక పర్సన్ ఇన్‌ఛార్జ్, సెక్రెటరీ అడ్డుకట్ట వేయగలిగితే కచ్చితంగా ఆదాయం గణనీయంగా పెరుగుతుంది.

● యార్డులో రైతులు ఎక్కువగా నష్టపోతున్నది మచ్చుకాయలు రూపంలోనే. ఇదొక వ్యవస్థీకృతం అయిపోయింది. ఎగుమతి, దిగుమతి వ్యాపారస్తులు, గుమాస్తాలు, హమాలీలు కలిసి ఈ మచ్చుకాయలను తీసుకెళ్లి బయట విక్రయిస్తూ రైతుకు నష్టం కలిగిస్తున్నారు. అసలు యార్డు నుంచి మచ్చుకాయలు అనేవి బయటకు వెళ్లకుండా గేట్ల వద్ద సెక్యూరిటీ గార్డులు అడ్డుకొనేలా చూడాలి. ఈ క్రమంలో కార్మిక సంఘాల నేతలు హమాలీలను రెచ్చగొట్టే ప్రయత్నాలు కూడా జరుగుతాయి. అయితే వాటని సమర్థవంతంగా అడ్డుకొంటేనే మచ్చుకాయలు తీయడానికి అడ్డుకట్ట పడుతుంది.


● మార్కెట్ కమిటీ నిర్ణయించిన కమీషన్, కాటా, దొడ్డికాపలా కూలి వంటి వాటి ఛార్జీల అమలు చేయాలి. దీని వలన రైతుకు మేలు జరుగుతుంది.

● కోల్డ్‌స్టోరేజ్‌ల్లో నిల్వ చేస్తున్న మిర్చి టిక్కీలపై యాజమాన్యాలు జారీ చేసే బాండ్లు రైతుల పేర్లతోనే ఇచ్చేలా చూడాలి. లేకుంటే రాఘవేంద్ర కోల్డ్‌స్టోరేజ్(కమీషన్ వ్యాపారి, కోల్డ్‌స్టోరేజ్ యజమాని కలిసి నకిలీ బాండ్లు సృష్టించి అమ్మేయడం) లాంటి సంఘటనలే జరుగుతాయి.

● మార్కెటింగ్ శాఖ జారీ చేసిన జీవో ప్రకారం కమీషన్ వ్యాపారస్తులతో సెక్యూరిటీ డిపాజిట్‌లు కట్టిస్తే యార్డు బ్యాంకు నిల్వలు పెరుగుతాయి.

● అన్ సీజన్‌లో కొన్నిరకాల పంట ఉత్పత్తులనైనా యార్డులో ట్రేడింగ్ జరిగేలా చూడగలిగితే అదనపు ఆదాయం సమకూరుతుంది. గతంలో గొర్రెల మండి రూపంలో ఆదాయం వచ్చేది. అది ఇప్పుడు ప్రత్తిపాడు పరిధిలోకి వెళ్లిపోయినందున ఆదాయం తగ్గింది. ఈ నేపథ్యంలో మార్కెట్ కమిటీ పరిధిలో మండి ఏర్పాటు చేసుకోగలిగితే ఆదాయం పెంచుకోవచ్చు.

మిర్చియార్డు సెక్రటరీగా ఆంజనేయులు బాధ్యతల స్వీకారం



గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు (గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ) ఉన్నతశ్రేణి కార్యదర్శిగా వినుకొండ ఆంజనేయులు పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. మార్కెటింగ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ ఉత్తర్వుల మేరకు ఆయన ఆదివారం యార్డు పరిపాలన భవనానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. మాచర్లకు చెందిన ఆంజనేయులు 1985లో మార్కెటింగ్ శాఖ సర్వీసులోకి వచ్చారు. ఆయన దాదాపుగా 39 ఏళ్ల నుంచి మాచర్ల, పొన్నూరు, దుగ్గిరాల, తెనాలి, గుంటూరు, ఈపూరు, పొదిలి, గిద్దలూరు, కంభం, మార్కాపురం, మైలవరం, తుని, రాజమహేంద్రవరంలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. గతంలో మిర్చియార్డులో అసిస్టెంట్ సెక్రటరీగా కూడా పరిపాలన విభాగంలో విధులు నిర్వహించిన అనుభవం ఉన్నది. నూతన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆంజనేయులు మీడియాతో మాట్లాడారు. మిర్చి సీజన్ మరో రెండు నెలల్లో రాబోతున్నదనీ, ఆలోపు కోల్డ్‌స్టోరేజ్‌లలో ఉన్న నిల్వసరుకు విక్రయం జరగాలనీ, అందుకోసం అవసరమైన చర్యలు చేపడతామన్నారు. ఎక్స్‌పోర్టర్లు, దిగుమతిదారులతో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	128, 138,148
చికెన్ విత్ స్కిన్	240.00
చికెన్ స్కిన్ లెస్	250.00

'రోటరీ క్లబ్ ఆఫ్ వికాస్' ఉచిత కంటి వైద్య శిబిరం

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్ ఆధ్వర్యంలో స్థానిక కొరిటపాడు ఆర్‌సీఎమ్ అప్పర్‌ప్రైమరీ స్కూల్ ఆవరణలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శంకర కంటి ఆస్పత్రి వైద్యుల సహకారంతో పోలిశెట్టి సుబ్బారాయుడు చారిటీస్ ట్రస్టు బోర్డు చీరాల వారు పి.మెహతాబ్‌ఖాన్ నేతృత్వంలో జరిగిన ఈ శిబిరానికి 220 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. 50 మందికి కంటి లోపాలు ఉన్నట్లు గుర్తించి చికిత్స కోసం పెదకాకానిలోని శంకర ఆస్పత్రికి తరలించారు. క్లబ్ అధ్యక్షుడు పి.ఆదిశేషు, క్లబ్ సర్వీస్ ప్రాజక్టు డైరక్టర్ ప్రేమ్‌కుమార్, క్లబ్ పూర్వాధ్యక్షుడు వైపె చౌదరి, సుధీర్‌బాబు, డాక్టర్ పి.సుధాకర్, మెహతాబ్ ఖాన్ పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన ఉండాలి

గుంటూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నానాటికీ పెరుగుతున్న కిడ్నీ వ్యాధులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని డాక్టర్ వీ వెంకటనాయుడు పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆరోగ్యసభలో ఆయన మాట్లాడారు. మూత్రపిండాల (కిడ్నీలు) పాత్ర చాలా ముఖ్యమైందని, రక్తం శుద్ధి చేసే కిడ్నీలు అనారోగ్యానికి గురైతే ఆ ప్రక్రియ దెబ్బతిని మిగిలిన అవయవాలు కూడా అనారోగ్యానికి గురయ్యే ప్రమాద ముందన్నారు. మనం తీసుకునే నీటిలో, వివిధ ఆహార పదార్థాల మూలంగా మూత్ర పిండాలలో రాళ్ళు ఏర్పడ తాయని, అవి పెద్దవైతే శస్త్ర చికిత్స చేయక తప్పదని అన్నారు. రోజుకు నాలుగు నుంచి ఐదు లీటర్ల నీటిని తాగాలని సూచిం చారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని కోరారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, టీవీ సాయి రామ్, డాక్టర్ రమ్య, డాక్టర్ ఏ రవీంద్రకుమార్, అచ్యుత ఇందు శేఖర్ పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు రుణాల జారీలో జాతీయ స్థాయి గుర్తింపు అభినందనీయం


● బీజేపీ కిసాన్ మోర్చా నేత పాండురంగ విఠల్

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో అధికారులు, బ్యాంకర్లు సమైక్యంగా కృషి చేసి గుంటూరు నగరంలో చిరు వ్యాపారులకు రుణం అందించడం ద్వారా జాతీయస్థాయిలో గుర్తింపు రావడం అభినందనీయమని బీజేపీ కిసాన్ మోర్చా నేత పాండురంగ విఠల్ ఒక ప్రకట నలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వానిధి పథకంతో చిరు వ్యాపారులను ఆదుకోవాలనే సంకల్పాన్ని దిగ్విజయంగా కొన సాగించిన గుంటూరు నగర కార్పొరేషన్, బ్యాంక్ అధికారులను అభినందించాలని, చిరు వ్యాపారులు, స్ట్రీట్ వెండర్స్‌ను క్రమబద్ధీకరిం చాల్సిన అవసరం ఉందని తెలిపారు. రోడ్డుపై బండ్లు పెట్టుకుని వ్యాపారం చేస్తున్నందు వల్ల ట్రాఫిక్ సమస్యలు అధికమవుతున్నాయని, కార్పొరేషన్, పోలీస్, రెవెన్యూ యంత్రాంగాలు సమైక్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టి ట్రాఫిక్ సమస్యను క్రమబద్ధీకరించాలని కోరారు.



రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని పొత్తూరు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీ కొని గుర్తుతెలియనివ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి జరిగింది. పొత్తూరు వద్ద సర్వీస్ రోడ్డుపై ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదానికి కారణమైన వాహనం ఆగకుండా వెళ్ళిపోయింది. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వయసు సుమారు 25 సంవత్సరాలు ఉంటుందని సమాచారం. మృతుని సమాచారం తెలిసిన వారు నల్లపాడు పోలీస్‌స్టేషన్ సీఐని 86888 31376 నంబరులో సంప్రదించాలని కోరారు.



ఆలయం ఆవరణను పరిశుభ్రం చేస్తున్న సంస్థ సభ్యులు

ప్రణవపీఠం - గుడిబడి సేవా సంస్థ ఆధ్వర్యంలో

ఆలయాల పరిశుభ్రత

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రణవ పీఠాధిపతి వద్దిపర్తి పద్మాకర్ స్థాపించిన స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక నల్లచెరువులో శివాలయం, కోదండ రామాలయాల ఆవరణలలోని పిచ్చిమొక్కలు, వ్యర్థాలు, విగ్రహాలను ప్రణవ పీఠం- గుడిబడి గుంటూరు సభ్యులు ఆదివారం శుభ్రం చేశారు. ఆలయాల ఆవరణను నీళ్లతో కడిగి పరిశుభ్రం చేశారు. ఆలయాలను పరిశుభ్రం చేసే కార్యక్రమం అన్ని ప్రాంతాల్లో చేపడుతున్నట్లు నిర్వాహకుల తరఫున బీవీఎల్ ప్రసాద్ తెలిపారు. ఆలయాల నిర్వహణ భారమై కొన్ని దేవాలయాల్లో పరిశుభ్రత లోపిస్తోందని, 'గుడిబడి' కార్యక్రమం ద్వారా వాటిని శుభపరచడమే తమ లక్ష్యమని చెప్పారు. గుడి, బడి నిర్వాహకులు ఎవరైనా ఒక వారం ముందు తమకు చెబితే ప్రణవ పీఠాధిపతుల దృష్టికి తీసుకెళ్ళి మరుసటి ఆదివారం నాటికి సంస్థ సభ్యుల సొంత ఖర్చులతో కావాల్సిన చీపుళ్ళు, బూజు కర్రలు, రసాయనాలు వంటివన్నీ తామే తెచ్చుకొని సాయంత్రానికి ఆలయాన్ని పూర్తిగా పరిశుభ్రం చేసి అప్పగిస్తామన్నారు. తమ సభ్యులంతా గౌరవ ప్రదమైన ఉద్యోగాల్లో ఉన్నారని, అందుకే ఆదివారం సెలవును ఈ విధంగా సద్వినియోగం చేసుకుంటున్నట్లు చెప్పారు.



పార్కులో దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలు



అసంపూర్తిగా నిర్మాణపు పనులు

చుట్టుగుంట పార్కు అభివృద్ధికి గ్రహణం

● కళావిహీనంగా పార్కు

● విష సర్పాలు, అధ్వానపు వాకింగ్ ట్రాక్

● రాత్రిళ్ళు మందుబాబుల మకాం

గుంటూరు, అక్టోబరు 27(ఆంధ్ర జ్యోతి): నగరంలోని చుట్టుగుంట పార్కు అభివృద్ధికి ఇప్పట్లో గ్రహణం వీడేలా కనిపించడం లేదు. పచ్చదనం లేక కళావిహీనంగా పార్కు పరిసరాలు, రాత్రిళ్ళు మందుబాబుల హల్‌చల్, విష సర్పాలు, అధ్వానపు వాకింగ్ ట్రాక్ ఇలా అనేక సమస్యలు పార్కులో తాండవిస్తున్నాయి. చుట్టుగుంట పరిసర ప్రాంతాలైన ఏటీ అగ్రహారం, శివరామ్‌నగర్, శాంతినగర్, మల్లారెడ్డినగర్, హనుమాన్‌నగర్ పరిసర ప్రాంతాల ప్రజలు నిత్యం వాకింగ్‌తో పాటు ఆహ్లాదం కోసం ఈ పార్కుకు వస్తుంటారు. నిత్యం ఉదయం వాకర్స్‌తో పాటు సాయంత్రం వేళల్లో మహిళా వాకర్స్ పెద్ద ఎత్తున వస్తున్నారు. అయినప్పటికీ పార్కు అభివృద్ధికి నగరపాలక సంస్థ తీసుకుంటున్న చర్యలు శూన్యం. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో సుందరంగా తీర్చిదిద్దుతామంటూ ప్రకటనలు చేసి చెరువులో కొద్దిపాటి గోడల నిర్మాణాలు చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు.

ట్రాక్ విస్తరణ పేరుతో రెండు దఫాలుగా నిధులు వృథా చేశారు తప్ప ఏమాత్రం అభివృద్ధి కనిపించకపోగా ఉన్న పచ్చదనాన్ని లేకుండా చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాకింగ్ చేస్తుండగా విషసర్పాలు కనిపిస్తుండటంతో వాకర్స్ భయాందోళన చెందుతున్నారు. సమీపంలోనే బార్, వైన్స్ ఉండటంతో మందుబాబులు కొందరు రాత్రిళ్ళు పార్కులో తిష్ట వేసి మద్యం బాటిళ్ళు, బిర్యానీ ప్యాకెట్లు అక్కడ పడేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇక గతంలో దాతల సహకారంతో నిర్మించిన మరుగుదొడ్లు నిర్వహణ లేక మూలనపడేశారు. అభివృద్ధి పనుల పేరుతో ఇప్పటికే ఉన్న ఓపెన్ జిమ్ వస్తువులను తొలగించి నిరుపయోగంగా పక్కన పడేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పార్కు అభివృద్ధిపై వాకర్స్‌లో ఆశలు చిగురించాయి. నాలుగు నెలలైనప్పటికీ కనీసం పార్కులో అభివృద్ధి పనులపై దృష్టి సారించకపోవడంపై వాకర్స్ పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, నగరపాలక సంస్థ అధికారులు స్పందించి పార్కు అభివృద్ధిపై చర్యలు తీసుకోవాలని మిక్కిలి విజ్ఞప్తి చేస్తున్నారు.







చుట్టుగుంట పార్కులో నిరుపయోగంగా ఉన్న ఓపెన్ జిమ్ వస్తువులు, మూతపడిన మరుగుదొడ్డి



అనధికారిక లేఔట్‌లలోని హద్దు రాళ్లు, రోడ్లను జెసీబీలతో తొలగిస్తున్న దృశ్యం

అనధికార లే అవుట్స్ పై ఉక్కుపాదం

● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అనధికార వెంచర్లు, లే అవు ట్స్ ఉండడానికి వీలులేదని, అటు వంటి వాటిపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి తొలగిస్తామని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసు స్పష్టం చేశారు. కమిషనర్ ఆదే శాల మేరకు ఆదివారం నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు ఆర్.టి.ఓ.ఆఫీస్ రోడ్, సీతయ్య డొంక రోడ్లలోని అనధికార లే అవుట్స్ లో ఏర్పాటు చేసిన హద్దు రాళ్ళు, బోర్డులు, రోడ్లను 3 జేసీబీలతో పూర్తి స్థాయిలో తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగర పరిధిలో దరఖాస్తు చేసిన లే అవుట్స్‌కి నిర్దేశిత గడువులోగా తగిన అనుమతులు మంజూరు చేస్తున్నా మన్నారు. అనధికార వెంచర్లలో ప్లాట్‌లు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో జీఎంసీ నుండి అభివృద్ధి పనులు చేపట్టడానికి వీలుకావడం లేదని, ఫలితంగా మౌలిక వస తులు లేక ప్లాట్ ల కొనుగోలుదార్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రన్నారు. ఇప్పటికే పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రజల నుండి ల్యాండ్ టైటిల్ వివా దాలపై పలు ఫిర్యాదులు అందాయన్నారు. నగర పాలక సంస్థ నుండి లే అవుట్స్ అనుమతి పొం దిన ప్లాట్ విక్రయదారులు వాటి అనుమతి వివరాలతో సమాచార బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అనధికార లే అవుట్స్ రిజిస్ట్రేషన్ నిలుపుదలపై డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్‌కి లేఖ పంపుతామన్నారు. నగర పరిధిలో గుర్తించిన 40 అనధికార లే అవుట్స్ కు ఇప్పటికే నోటీసులు జారీ చేసామని, స్పెషల్ డ్రైవ్ మోడ్ లో తొల గించడానికి పట్టణ ప్రణా ళిక అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

జీఎంసీ ఎలక్షన్ సెల్‌లో ఎమ్మెల్సీ ఓటు హక్కు అర్జీలు

గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎమ్మెల్సీ అప్లికేషన్ తీసుకుంటున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఎలక్షన్ సెల్‌లో ఎమ్మెల్సీ ఓటు అర్జీలను అధికారులకు అందచేయవచ్చని, గుంటూరు ఈస్ట్, వెస్ట్ కలిపి ఆన్‌లైన్ అప్లికేషన్లను సుమారు 9 వేల మంది దరఖాస్తు చేశారని చెప్పారు. బుధవారం నుండి దరఖాస్తు చేసిన అర్జీలను బీఎల్‌ఓ క్షేత్ర స్థాయి వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. అవసరమైతే ఎన్నికల విభాగంలో సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని వివరించారు.



గోశాలలో అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

జీఎంసీ గోశాలలో మౌలిక వసతులకు కమిషనర్ ఆదేశాలు

గుంటూరు నగరపాలక సంస్థ గోశాలలో ఆవులకు మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమివ్వాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కమిషనర్ పి. శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక వెంగళాయ పాలెంలోని జీఎంసీ గోశాలను ఆదివారం ఆయన పరిశీలించారు. తీసుకోవాల్సిన చర్యలపై ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ గోశాలలో ఆవులను శుభ్రం చేయడానికి, నీరు బయటకు వెళ్లడానికి వీలుగా ప్లాట్ ఫారం, అదనపు షెడ్ ని ఏర్పాటు చేయాలని, మేతకి వినియోగించే గడ్డి తడవకుండా షెడ్డు వేయాలని, ఆవుల సంరక్షణకు కేటాయించిన సిబ్బంది వివరాలను తమకు అందించాలని, ప్రజారోగ్య అధికారులు పర్యవేక్షించాలనిఆదేశించారు. గోశాలకు తరలించిన ఆవులను వాటి యజమానులు కావాలని అడిగినప్పుడు, వారికి అప్పగించేందుకు నిర్దేశిత ఫైన్, డాక్యుమెంటేషన్ సిద్ధం చేయాలని చెప్పారు. పర్యటనలో ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈ కల్యాణ రావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, ఆనందకుమార్, టీపీఎస్ లక్ష్మణ స్వామి, ఏఈ రవి కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ కమిషనర్'

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సమస్యల పరిష్కారానికి 28వ తేదీ ఉదయం 9:30 నుండి 10:30 గంటల వరకు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వీధి దీపాలు, సచివాలయ సేవలు, మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి 0863-2224202 నంబర్‌కి కాల్ చేయాలని తెలిపారు. ఆయా సమస్యలను నేరుగా కమిషనర్ దృష్టికి తీసుకురావచ్చని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న అఖిల భారత యాదవ మహాసభ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సోంప్రకాష్ యాదవ్

యాదవులు విద్యకు ప్రాధాన్యమివ్వాలి

గుంటూరు సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యాదవులు విద్యకు ప్రాధాన్యమివ్వాలని అఖిల భారత యాదవ మహాసభ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సోంప్రకాష్ యాదవ్ అన్నారు. స్థానిక అరండల్ పేట వైన్ డీలర్స్ అసోసియేషన్ కళ్యాణ మండ పంలో ఆదివారం జరిగిన సమా వేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు నాగమల్లేశ్వరి యాదవ్ అధ్యక్షత వహించారు. సోంప్రకాష్ యాదవ్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న శతాబ్ది ఉత్సవాలకు గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఒం గోలు జిల్లాల నుండి యాదవులు అధిక సంఖ్యలో హాజరు కావాలని సోంప్రకాష్ యాదవ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షురాలు మహేశ్వరి యాదవ్ మాట్లాడుతూ కుల గణన జరగాలని, అన్ని రంగాల్లోనూ యాదవులకు రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆవుల వీరశేఖర్ యాదవ్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ అఖిల భారత యాదవ సంఘం కమిటీలను ఏర్పాటు చేసి సంఘాన్ని బలోపేతం చేస్తానని అన్నారు. సమా వేశంలో బి.రామారావుయాదవ్, పూర్ణచంద్రరావు యాదవ్, పీఎం కొండయ్య యాదవ్,డాక్టర్ ఉమాపతి యాదవ్, టి.వెంకటేష్ యాదవ్, ఎ. వరప్రసాద్ యాదవ్, వై.తులసిరామ్‌యాదవ్, లక్ష్మీప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలు, గోడౌన్‌ల వద్ద

భద్రతా ప్రమాణాలు పాటించాలి

● లైసెన్సులు తనిఖీ చేయాలి

● అక్రమ విక్రయాలు జరిపితే కఠిన చర్యలు

● అక్రమ నిల్వలపై ఫిర్యాదుకు 8688831568,100

● ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలు



మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రానున్న దీపావళి పండుగను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా బాణసంచా దుకాణ దారులు, గోడౌన్లు వద్ద భద్రత ప్రమాణాలను పాటించాలని ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. జిల్లాలో ఫైర్ డిపార్టుమెంట్ అధికారులతో కలిసి ఆదివారం పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దీపావళి పండగ వస్తున్న నేపథ్యంలో బాణసంచా విక్రయించే షాపులు, గోడౌన్లు,లైసెన్సులు తనిఖీ చేయాలని, భద్రత ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అదే సమయంలో అనధికారంగా బాణసంచా విక్రయాలు జరగకుండా చూడాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. బాణసంచా షాపులు, గోడౌన్లు వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా, ముందస్తు భద్రత చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాణసంచా అక్రమ విక్రయాలు, అక్రమ నిల్వలపై సంబంధించిన సమాచారం ఉంటే జిల్లా పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 8688831568లో లేదా 100కు సమాచారం తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ స్పష్టం చేశారు.



పార్టీ సభ్యత్వం నమోదు చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

టీడీపీ సభ్యత్వం ఆత్మగౌరవ సంకేతం: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ప్రతి ఒక్కరికీ ఆత్మ గౌరవ సంకేతమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని ఐదో డివిజన్‌లో ఆదివారం ఆయన ఆధ్వర్యంలో టీడీపీ క్రియాశీలక సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరూ టీడీపీ కుటుంబ సభ్యులుగా నమోదు కావాలని పిలుపు నిచ్చారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో జరుగుతున్న రాష్ట్ర అభివృద్ధిని చూసిన ప్రజలు టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ సభ్యత్వం తీసుకునేందుకు సిద్ధంగా వున్నారని అన్నారు.సభ్యత్వం నమోదులో గుంటూరు తూర్పు రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండాలని తెలుగు తమ్ముళ్లకు ఆయన సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు చిలక వెంకటేశ్వర్లు, మాజీ డిప్యూటీ మేయర్ .గౌస్, కోట పిచ్చిరెడ్డి, షేక్ జానీ బాషా, మునియా, వంగర ఏడుకొండలు, సింహాద్రి, బషీర్, బాబురావు, శ్యామల తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శుద్ధపల్లి డొంక మెయిన్ రోడ్డుకు మహర్దశ

గుంటూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): శుద్ధపల్లి డొంక మెయిన్‌రోడ్డుకు మహర్దశ రాబోతోందని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నియోజవర్గంలోని 10వ డివిజన్‌లో ఆదివారం ఆయన పర్యటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ వైఫల్యంతో మరుగునపడ్డ గుంటూరు తూర్పు నియోజకవర్గ అభివృద్ధి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే పరుగులు పెడుతోందని చెప్పారు. త్వరలో గుంతలు లేని గుంటూరును ప్రజలు చూడబోతున్నారని, శుద్ధపల్లి డొంక మెయిన్ రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న రెండు నెలల్లో రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ఈ మెయిన్ రోడ్డుకు మహర్దశ తీసుకొస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎల్లావుల అశోక్, మీరావలి, చిస్టీ, పఠాన్ జమీర్, గాలి సతీష్, రియాజ్, అఖిని, ఉస్మాన్, జనసేన నాయకులు శేఖర్, జడ సురేష్ పాల్గొన్నారు.



పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీరయ్య, ఖాదర్‌బుడే తదితరులు

పట్టభద్రులంతా ఓటు నమోదు చేసుకోండి

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : అర్హత ఉన్న పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని 39 వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు శింగంశెట్టి వీరయ్య సూచించారు. ఈ మేరకు ఆదివారం ఉదయం 8:00 గంటల నుండి సాయంత్రం 6:00 వరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ 39వ డివిజన్ అధ్యక్షుడు శింగంశెట్టి వీరయ్య ఆధ్వర్యంలో గుజ్జనగుండ్ల వాకింగ్ ట్రాక్ వద్ద గుంటూరు-కృష్ణ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రఫీ, శింగంశెట్టి శివ కుమార్, షేక్ అబ్దుల్ ఖాదర్ బుడె, మస్తాన్ వలి, గోపిశెట్టి విజయ్, వేణు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కనపర్తి శ్రీనివాసరావు


వైసీపీ నేతలు నోరు అదుపులో పెట్టకపోతే..

● కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డితో పాటు భూమన కరుణాకరరెడ్డి తదితర వైసీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడకపోతే వారికి చెప్పు దెబ్బలు తప్పవని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు హెచ్చరించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజారెడ్డి, రాజశేఖరరెడ్డి, జగన్మోహనరెడ్డి చేసిన హత్యలు, అరాచకాలు, పాపాల వల్లే వైఎస్ కుటుంబానికి నేడు ఈ గతి పట్టిందని విమర్శించారు. సీఎం పీఠం కోసం సొంత బాబాయిని అతి కిరాతకంగా హత్య చేయించడమే కాకుండా, కోడి కత్తి డ్రామాతో దళితుడిని బలి చేయడం, గులకరాయి డ్రామాతో బీసీ యువకుడిని వేధించారని,ఆయా వర్గాల శాపం ఉరికే పోలేదని అన్నారు. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని దోచుకున్న ఆస్తులను పంచుకోవడంలో అన్నా, చెల్లెళ్ళ మధ్య వచ్చిన విభేదాలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. జగన్ నిజాయితీగా వ్యాపారాలు చేసి డబ్బు సంపాదించాడని 'ఛీటెడ్ అక్కౌంటెంట్ విజయసాయిరెడ్డి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని అల్లిబిల్లి కంపెనీలు సృష్టించి, క్విడ్ ప్రో కో ద్వారా లక్షల కోట్ల ప్రభుత్వ ధనాన్ని కొల్లగొట్టినందుకే 16 నెలలు జైల్లో జంటగా చిప్పకూడుతిన్న సంగతి సాయిరెడ్డి మర్చిపోవద్దన్నారు. అంతర్జాతీయ నేరస్తుడు చార్లెస్ శోభరాజ్‌కు ఏ మాత్రం తీసిపోని విజయసాయిరెడ్డి నేరమయ జీవితం ముగింపు కూడా అలానే ఉండబోతుందని హెచ్చరించారు. జగన్ సేవలో తరిస్తూ డబ్బు సంపాదించుకున్న సుబ్బారెడ్డి, సాయిరెడ్డి ఆయన్ను పొగుడుకుంటే తమకు అభ్యంతరం లేదని, చంద్రబాబుని విమర్శిస్తే మాత్రం పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో కార్పొరేటర్లు యల్లావుల అశోక్‌యాదవ్, నూకవరపు బాలాజీ, గోళ్ళ ప్రభాకర్, ఆనంద్ పాల్గొన్నారు.

పీ హెచ్ సీల ద్వారా '104' సేవలు నిర్వహించాలి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 27(ఆంధ్ర జ్యోతి): 104 సేవలను పీహెచ్‌సీల ద్వారా నిర్వహించాలని ఏపీ 104 ఎంఎంయూ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు కే సత్యరాజ్ డిమాండ్ చేశారు. స్థానిక పాతగుంటూరు ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 ఉద్యోగుల సమస్యలు పరి ష్కారం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఆప్కాస్ లేదా కాం ట్రాక్టులో చేర్చి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వం, యాజమాన్యం యూనియన్ నాయకత్వంతో తక్షణమే చర్చలు జరిపి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి విజయ్, నాయకులు ఏడు కొండలు, సురేష్ బాబు, సాయిరాం, నాగులు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రోటోఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న శరత్ చౌదరి తదితరులు

రోటో ఫెస్ట్-2024 ప్రారంభం

గుంటూరు(తూర్పు),అక్టోబరు 27 (ఆంధ్ర జ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో రోటరీ క్లబ్ గుంటూరు ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జరిగే క్రీడా ఉత్సవాలు 'రోటో ఫెస్ట్ 2024' ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన క్లబ్ జిల్లా గవర్నర్ శరత్ చౌదరి క్రీడా ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యా ర్థులలో క్రీడా నైపుణ్యాలను, మానసిక ధైర్యాన్ని వెలికి తీసేందుకు ప్రతి ఏడాది అంత ర్జాతీయంగా రోటో ఫెస్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు గాలి సుబ్బారావు మాట్లాడుతూ పోటీల్లో భాగంగా తొలిరోజున 100 మీటర్లు, రన్నింగ్, హై జంప్, లాంగ్ జంప్, 100 మీటర్స్ రిలే రన్, టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించామన్నారు. సోమవారం వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ బాస్కెట్ బాల్ పోటీలు జరుగుతాయని తెలిపారు. క్లబ్ సభ్యులు పీఎస్ కార్తికేయన్ హీరేన్ సంఘవి తదితరులు పాల్గొన్నారు.


శిల్పారామం ముఖద్వారం



శిల్పారామం పూర్తి చిత్రం


ఫొటో.. సెల్ఫీపాయింట్

శిల్పారామం.. కళానిలయం


బోటింగ్ పాయింట్ కానున్న చెరువు


పిల్లల ప్లే జోన్.. ఆట సామగ్రి


హస్తకళా స్టాళ్లలోని వస్తువులు


టాయ్ ట్రెయిన్

అద్భుతమైన హస్తకళా శిల్పాలకు నెలవు

ఆధునిక సొబగులతో ఆహ్లాదకర వాతావరణం

హైదరాబాదు స్ఫూర్తిగా గుంటూరులో 2014లో శంకుస్థాపన

అమ్యూజ్‌మెంట్ పార్కు, బోటింగ్, పిల్లల ప్లేజోన్, కన్వెన్షన్ హాలు

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కళలకు కొలువు.. హస్త కళా శిల్పాలకు నెలవుగా గుంటూరు శిల్పారామం అలరారుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాదుకు కళాతోర ణంగా ఉన్న శిల్పారామం స్ఫూర్తితో గుంటూరులో శిల్పారామం రూపుదిద్దుకుంది. ఆంధ్రప్రదేశ్ శిల్పా రామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ కల్చరల్ సొసైటీ అనేది రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలోని స్వయం ప్రతిపత్తి కలిగిన సొసైటీ శిల్పారామం నిర్మాణానికి 2014లోనే నాంది పడింది. అప్పటి మంత్రి రావెల కిశోర్‌బాబు 2016 డిసెంబరు 10న శంకుస్థాపన చేయగా, 2023 అక్టోబరు 14న అప్పటి పర్యా టక మంత్రి ఆర్కే. రోజా శిల్పారామాన్ని ప్రారంభించారు. శిల్పారామం గుంటూ రుకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అ త్యంత పురాతనం, సుసంపన్నం, వైవి ధ్యమైన కళలు, గ్రామీణాంధ్ర, సాం స్కృతిక అంశాలను విశ్వవ్యా పితం చేయాలి అనే లక్ష్యంతో శిల్పారామం నిర్మాణం జరిగింది.

మూడు జోన్లలో అభివృద్ధి

గుంటూరు శివార్లలోని అడవితక్కెళ్లపాడులో శిల్పారామాన్ని ఏర్పాటు చేశారు. జోన్-1లో కొండపల్లి బొమ్మలు, చేనేత వస్త్రాలు, ఊలు తివాచీలు, కళంకారీ వస్త్రాలు, పెయింటింగులు విక్రయించే 16 స్టాళ్లు నడు స్తున్నాయి. నాటి నుంచి నేటి యుగం వరకూ ప్రజల జీవన సంస్కృతిని ప్రతిబింబించేలా ఎంట్రన్స్ ప్లాజాను ఆకర్షణీయంగా నిర్మించారు. ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేశా రు. పిల్లలను ఆహ్లాదపరిచేందుకు పిల్లల ప్లే జోన్ ఏర్పాటు చేశారు. జానపద, సాంస్కృతిక కళల ప్రదర్శన కోసం కళావేదిక యాంఫీ-థియేటర్‌ను రూపొందించారు.

బోటింగ్ కేంద్రం ఏర్పాటు

శిల్పారామం వెనుకభాగంలో జోన్-2 పరిధిలో మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువును బోటింగ్ కేంద్రంగా మార్చేందుకు సిద్ధమయ్యారు. ఐటీసీ సౌజన్యంతో జీఎంసీ ఏర్పాట్లు ప్రారంభించింది. అవి సగం వరకూ పూర్తయ్యాయి. మిగిలిన నిధుల కోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నిధులు సమీకరణ జరుగుతుంది. అవి వస్తే ఈ పనులు చకచకా పూర్తై బోటింగ్ కేం ద్రం అందుబాటులోకి రానుంది. జోన్- 3 కింద కేటాయించిన 3.31 ఎకరాల వి స్తీర్ణంలో పార్టీజోన్‌ను ఏర్పాటు చే యాలని నిర్ణయించారు. పిల్లల కో సం వాటర్ వరల్డ్, చిల్డ్రన్స్ గేమ్స్ అమ్యూజ్ మెంట్ పార్కును నిర్మించనున్నారు.

పల్నాడు మార్గంలో పెరిగిన రైళ్ల వేగం

(7వ పేజీ తరువాయి)

ఆటంకం కలిగే పరిస్థితి ఉత్పన్నమైంది.

పరిస్థితులు మారాయి..

గతంలో గుంటూరు - నంద్యాల రైలుమార్గం సింగిల్ లేన్‌గా ఉండేది. దాంతో రైళ్ల క్రాసింగ్‌ల కోసం చాలా సమయం లూప్‌లైన్‌లో పెట్టాల్సిన పరిస్థితి ఉండేది. ఏరోజు సమయానికి ప్రయాణించేవి కావు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. లోగడ నంద్యాలకు చేరుకోవడానికి కనీసం ఐదు గంటలకు పైగా సమయం పట్టేది. ఇప్పుడు 3 గంటల 40 నిమిషాల వ్యవధిలోనే హాల్టింగ్‌లతో చేరుకుంటున్నాయి. తాజాగా నంబరు 22831 హౌరా - యశ్వంత్‌పూర్ శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం ఎక్స్‌ప్రెస్ ఈ నెల 24వ తేదీ ఉదయం 10.54కి గుంటూరు నుంచి బయలుదేరింది. ఈ రైలు నరసరావుపేట, మార్కాపురం రోడ్డు, గిద్దలూరులో హాల్టింగ్ అయి నంద్యాలకు మధ్యాహ్నం 2.32కి చేరుకుంది. అది మొదలుకొని అక్కడి నుంచి బయలుదేరాల్సిన సమయం సాయంత్రం నాలుగు గంటల వరకు లూప్‌లైన్‌లో ఉన్నది. దాదాపుగా గంటన్నర పాటు నంద్యాల స్టేషన్‌లో ఈ రైలుని నిలపాల్సి వచ్చింది.

కొత్త టైంటేబుల్‌లోనైనా...

ఇదేవిధంగా రాత్రి వేళ హుబ్లీ - నరసపూర్ అమరావతి ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్ - మచిలీపట్నం కొండవీడు ఎక్స్‌ప్రెస్‌లు కూడా నిర్ణీత సమయం కంటే ముందుగానే గుంటూరుకు చేరుకుంటున్నాయి. ఆ సమయంలో గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాంలు ఖాళీ లేక పేరేచర్ల, నల్లపాడులో ఆపుకుంటూ తీసుకొస్తున్నారు. అలానే బ్రాడీపేట 14వ అడ్డరోడ్డు సిగ్నల్ పాయింట్ వద్ద కూడా అరగంట పాటు నిలిపేస్తున్నారు. మొత్తంగా రైళ్ల సగటు వేగం పెరిగింది. అమరావతి ఎక్స్‌ప్రెస్ సమయాన్ని తగ్గించినప్పటికీ మిగిలిన రైళ్ల సమయపట్టికని అలానే కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో రైల్వేబోర్డు విడుదల చేయబోయే కొత్త టైంటేబుల్‌లోనైనా గుంటూరు - నంద్యాల మధ్యన రాకపోకలు సాగిస్తున్న రైళ్ల ప్రయాణ సమయాన్ని తగ్గించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కౌలుకు మంచి రోజులు

(7వ పేజీ తరువాయి)

ఇవ్వాల్సి ఉన్నా బ్యాంకర్లు నిర్లక్ష్యం వహిస్తు న్నాయి. ఈ క్రమంలో దీనిని సరిదిద్ది కౌలు రైతులకు న్యాయం చేయడంపై పాలకులు దృష్టి సారించారు. వార్షిక పద్దులో 5 శాతం రుణాలు అంటే బాపట్ల జిల్లాలో దాదాపు రూ.200 కోట్లు కౌలు రైతుల వాటాగా ఉండాలి. అలాంటిది ఖరీఫ్ ముగిసే నాటికి అంతా కలిపి ఇచ్చిన రుణాలు రూ.25 కోట్లుగానే ఉండడం గమనార్హం. గుంటూ రు జిల్లాలో రూ.95 కోట్లు అందించాల్సి ఉండగా ఇప్పటికీ రూ.9 కోట్లు మాత్రమే రుణాలుగా అందించారు. ఇక పల్నాడు జిల్లాలో ప్రకటించిన వార్షిక పద్దులో కౌలు రైతుల వాటా దాదాపు రూ.140 కోట్లుగా ఉండగా ఇప్పటికీ అందించింది రూ.16 కోట్లకు మించకపోవడం వారిపై నిర్లక్ష్యా నికి నిదర్శనంగా కనబడుతోంది. సీసీఆర్ కార్డు ప్రామాణికంగానే కౌలు రైతులకు రుణాలు మం జూరు చేయాల్సి ఉన్నా క్షేత్రస్థాయిలో అమలు జరగడంలేదు. సీసీఆర్ కార్డు గడువు 11 నెలలు మాత్రమే కాగా అది కౌలు రైతుకు చేతికొచ్చేట ప్పటికే మూడు, నాలుగు నెలలు గడిచిపోతు న్నాయని దానివల్ల వారు రుణాలు తీసుకోలేకపో తున్నారనే అంశం ప్రభుత్వం దృష్టికి వచ్చింది.

● సీసీఆర్ కార్డుల ప్రామాణికంగా రైతులకు రుణాలు ● నిబంధనల విషయంలో సడలింపు ఇచ్చే దిశగా కసరత్తు

కౌలు రైతుకు సీసీఆర్‌కార్డు ఇచ్చినా భూమి యజ మాని ముందుగానే రుణం తీసేసుకుంటున్నారని దీని వల్ల సాంకేతికంగా ఒకే సర్వే నంబరు మీద రెండుసార్లు రుణం ఇవ్వడం కుదరలేదనేది కూడా బ్యాంకర్ల వాదన. ఒకే సర్వే నంబరుపై ఇద్దరికీ సీసీఆర్ కార్డులను రెవెన్యూ విభాగం మంజూరు చేస్తుందని, ఈ విషయంలో వ్యవసాయశాఖకు, రెవెన్యూ విభాగానికి సమన్వయం కొరవడడంతో అంతిమంగా ఆ ప్రభావం వారు అందుకునే రుణాలపై పడుతుందన్నారు.ఒకే సర్వే నంబరుపై రెండు కార్డులు జారీ చేసినవి ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా చూస్తే దాదాపు 5,000 వరకు ఉన్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది.

సీసీఆర్ కార్డులు పెద్ద సంఖ్యలోనే...

గత ప్రభుత్వంతో పోలిస్తే సీసీఆర్ కార్డుల జారీ విషయంలో కూటమి పాలకులు మెరుగైన ఫలితాలను రాబట్టగలిగారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బాపట్ల జిల్లాలో 1,06,300 కార్డు లను అందించాలని యంత్రాంగానికి వ్యవసాయ శాఖ లక్ష్యం నిర్దేశించగా ఇప్పటికే 95,000 వరకు కార్డులను కౌలు రైతులకు అందించారు. గుంటూరు జిల్లాలో 46,800, పల్నాడు జిల్లాలో 66,000 కార్డులు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా ఇందులో ఇప్పటికే 90 శాతం చేరుకున్నారు. గడిచిన ఐదేళ్లతో పోలిస్తే సీసీఆర్‌సీ కార్డుల జారీ విషయంలో 30 శాతం పెరుగుదల నమోదైంది.

అన్నింటిని పరిష్కరిస్తాం.. రుణాలివ్వాల్సిందే

కౌలు రైతులకు రుణాలు తీసికట్టుగా ఉండడానికి గల కారణాలపై యంత్రాంగం దృష్టి పెట్టింది. ముందుగా సీసీఆర్ కార్డుల జారీలో దొర్లిన సాంకేతిక తప్పిదాలను సవరించడంతో పాటురుణాల విషయంలో యజమానికి అవగా హన కల్పించి కౌలు రైతులకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత వ్యవసాయశాఖపైనే ప్రభు త్వం పెట్టింది. ఇందుకోసం అవసరమైతే గ్రామాల వారీగా కౌలు రైతులు, యజమానులతో సమావేశాలు పెట్టి వారికి ఉన్న అపోహలు నివృత్తి చేయాల్సిన బాధ్యత కూడా పెట్టింది. రుణాల విషయంలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను సాధ్యమైనంత త్వరగా పరిష్క రించి కనీసం రబీ సీజన్‌లో అయినా కౌలు రైతులకు మంచిరోజులు తేవడానికి కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది. కౌలు చట్టానికి సవరణలు చేసైనా రైతులకు మేలు చేయాలన్న కృతనిశ్చయంతో కూటమి పాలకులు ఉన్నారు.

బీచ్‌కి రావాలంటే.. రూ.20

రుసుము కడితేనే పర్యాటకులకు ప్రవేశం

జనవరి 1 నుంచి వసూలు చేసేందుకు చర్యలు

అభివృద్ధి కోసం వసూలు చేయాలని బాపట్ల ఎమ్మెల్యే ప్రకటన

బాపట్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తీరానికి రావడం.. సముద్ర స్నానాలు చేయడం.. ఆహ్లాదం పొందడం అందరికీ ఇక కుదరదు. ఫీజు కడితేనే సముద్ర తీర ప్రవేశం ఉంటుంది. ప్రముఖ పర్యాటక కేంద్రంగా సూర్యలంక సముద్రతీరం విరాజిల్లుతున్నది. సెలవు వచ్చినా.. పుణ్య స్నానాలన్నా సూర్యలంక బీచ్‌కి చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా పర్యాటకులు, భక్తులు పోటెత్తుతుంటారు. ఇలా వచ్చే వారి నుంచి ఫీజు వసూలు చేసి ఆ మొత్తంతో తీర ప్రాంత అభివృద్ధి చేయాలని శుక్రవారం బాపట్ల మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రకటించారు. రూ.20 ఫీజుగా నిర్ణయించి దానిని జనవరి 1 నుంచి వసూలు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

అయితే ఈ విషయం తెలిసి పర్యాటకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడాలేని విధంగా పర్యాటకుల నుంచి రుసుము వ సూలు చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. టోల్‌గేట్ ద్వారా వాహనదారుల నుంచి ఇప్పటి వరకు రుసుము వసూలు చేస్తున్నారు. దీనినే పర్యాటకులు వ్యతిరేకిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో తాజాగా బీచ్‌లోకి ప్రవేశించే వారి నుంచి కూడా రుసుము వసూలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారన్న విషయంపై పర్యాటకుల నుంచి విమర్శలు వస్తున్నాయి. తీరంలో మూడుగేట్లు ఏర్పాటు చేసి బీచ్ ఎంట్రీ ఫీజు వసూలు చేయాలని టిక్కెట్లపై బీచ్ డెవలప్ మెంట్ ఫండ్ అని ఉంటుందని సమాచారం. సూర్యలంక బీచ్ అభి వృద్ధికి ఆదాయ మార్గాలు అన్వేషించాల్సిన విషయాన్ని పక్కన పెట్టి పర్యాకుల నుంచి నగదు వసూలు చేయాలన్న నిర్ణయం ఏమాత్రం సమర్థనీయం కాదని పలువురు చెప్తున్నారు. పర్యాటకులను మరింతగా ప్రోత్సహించేందుకు సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేసేందుకు కసరత్తు చేస్తుండగా ఇక్కడ ఫీజు వసూలు చేయాలన్న నిర్ణయం విమర్శలకు దారితీస్తోంది.


బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరంలో భక్తులు

ఎంపీఎల్ సీజన్-3 క్రికెట్ టోర్నీకి సన్నాహాలు

మంత్రి లోకేశ్ జన్మదినం సందర్భంగా ఏటా నిర్వహణ

రాష్ట్ర వ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాల నుంచి జట్లు

మంగళగిరి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ప్రీమియర్ లీగ్ సీజన్-3 క్రికెట్ టోర్నీ నిర్వహణకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్స వాన్ని పురస్కరించుకుని ప్రతియేటా జనవరిలో ఎంపీఎల్ పోటీలు నిర్వహిస్తున్నారు. సీజన్-3లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఉమ్మడి జిల్లాల నుంచి బెస్ట్ టీమ్‌లు పాల్గొననున్నారు. మంత్రి లోకేశ్ సొంత నియోజక వర్గమైన మంగళగిరి నుంచి ప్రత్యేకంగా ఓ జట్టు పాల్గొననుంది. మంగళగిరి నియోజకవర్గం నుంచి పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆది వారం నవులూరులోని క్రికెట్ స్టేడియంలో జరిగాయి. ఎంపిక చేయబడిన క్రీడాకారులతో సోమవారం నుంచి ప్రాక్టీస్ మ్యాచ్‌లు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు రాష్ట్ర స్థాయిలో జరిగే ఎంపీఎల్ సీజన్-3 టోర్నీలో మంగళగిరి జట్టు తరపున ప్రాతి నిధ్యం వహించే అవకాశాన్ని కల్పిస్తారు. యువతలో దాగివున్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించేందుకు మంత్రి నారా లోకేశ్ తన సొంత ఖర్చులతో మంగళగిరి కేంద్రంగా వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నారు. దీనికోసం ఇప్పటికే మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో రెండు క్రీడా మైదానాలను కూడా ఏర్పాటు చేశారు.


ఎంపీఎల్ జట్టు ఎంపిక పోటీలకు హాజరైన క్రీడాకారులు


ఎంపిక పోటీల్లో క్రికెట్ ఆడుతున్న యువకులు

సెంట్రల్ జోన్ బాస్కెట్‌బాల్ పోటీల్లో వీవీఐటీకి ద్వితీయస్థానం

భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన జేఎన్టీయుకే సెంట్రల్ జోన్ మెన్ అండ్ ఉమెన్ బాస్కెట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయని కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. విజేతల వివరాలను కళాశాల ఫిజికల్ డైరెక్టర్ క్రీడలు కమిటీ కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణరాజు మాట్లాడుతూ బాస్కెట్ బాల్ పురుషుల విభాగంలో నరసాపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల ప్రథమ స్థానం, గుంటూరు జిల్లా నంబూరు వీవీఐటీ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానం లోనూ విజయం సాధించారు. తృతీయ స్థానం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజ నీరింగ్ కళాశాల,గుంటూరు కెహెచ్‌ఐటీ కళాశాలకు సంయుక్తంగా దక్కింది. ఉమెన్ బాస్కెట్‌బాల్ విభాగంలో ప్రథమస్థానం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సాధించగా, ద్వితీయస్థానం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ కళాశాలకు, గుంటూరు కెహె చ్ఐటీ కళాశాలకు సంయుక్తంగా దక్కింది. ఉమెన్ బాస్కెట్‌బాల్ విభాగంలో ప్రథ మ స్థానం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సాధించగా, ద్వితీయస్థానం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల, తృతీయస్థానం గుంటూరు సెంట్ మేరీస్ ఇంజనీరింగ్ కళాశాల, ఒంగోల్ క్యూఐపి కళాశాలకు సంయుక్తంగా దక్కింది. నెట్‌బాల్ మెన్ విభాగంలో ప్రథమస్థానం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళా శాలకు, ద్వితీయస్థానం విజయవాడ పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలకు, మూడో స్థానం సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు, తాడేపల్లిగూడెం వాసవీ ఇంజనీరింగ్ కళా శాల నిలిచాయి. విజేతలకు ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు, ప్రిన్సిపాల్ డా.కెవి మురళీకృష్ణంరాజు, జెఎన్టీయుకే ఇంటర్ కాలేజీయట్ టోర్నమెంట్ సెక్రటరీ డాక్టర్ రాజు చేతుల మీదుగా బహుమతులు అందించారు.

అవినీతి అధికారులపై కొరడా

◆ మెప్మాలో అధికారుల వేధింపులపై ఆర్పీల ఫిర్యాదు

◆ అవినీతి ఆరోపణలపై మంత్రి నారా లోకేశ్ సీరియస్

మంగళగిరి సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో వేళ్లూనుకున్న అవినీతి వ్యవస్థ ప్రక్షాళనకు మంత్రి నారా లోకేశ్ నడుం బిగించారు. మంగళగిరిలో ఇద్దరు మెప్మా అధికారులపై వచ్చిన అవినీతి ఆరోపణలను మంత్రి లోకేశ్ సీరియస్‌గా పరిగణించి శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. వైసీపీ పాలనలో మహిళా సంఘాలను నిర్వీర్యం చేసి మెప్మాను అవినీతిమయం చేశారు. మంగళగిరిలో ఒక్కో మహిళా గ్రూపు నుంచి రూ.2 వేలు వసూలు చేసి ఇవ్వాలని రిసోర్స్ పర్సన్లపై సీవోలు ఒత్తిడి తెచ్చారు. మెప్మాలో అవినీతి అధికారులపై మహిళలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం మంత్రి నారా లోకేశ్ దృష్టికి రావడంతో ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ విషయమై మెప్మా పీడీ విజయలక్ష్మిని వివరణ కోరగా ఆర్పీల నుంచి ఫిర్యాదు అందిన మాట వాస్తవమేనన్నారు. ఇద్దరు డీపీఎంలతో కమిటీ వేసి సీవోలపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణకు ఆదేశించనున్నామన్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న అవినీతి అధికారుల గుండెల్లో అలజడి మొదలైంది.

నేడు డీఆర్‌సీ మీటింగ్

● కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి సమావేశం

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమీక్ష మండలి సమావేశం సోమవారం జరగనుంది. ఈ మేరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ నిర్ణయం తీసుకోగా సమావేశానికి అజెండాని అధికారులు సిద్ధం చేశారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను హాజరు కావాల్సిందిగా సమాచారం ఇచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరగనున్న తొలి సమావేశం కావడంతో సమావేశానికి ప్రాధాన్యం సంతరించుకున్నది. జిల్లాలో ప్రధానంగా ఇసుక కొరత సమస్య పట్టి పీడిస్తున్నది. కొత్తగా మూడు రీచ్‌లకు టెండర్లు నిర్వహించినా కృష్ణానదిలో వరద ప్రవాహం కారణంగా ఇసుక తీయలేని పరిస్థితి నెలకొన్నది. కొత్త రేషన్‌కార్డులు, సామాజిక పింఛన్ల కోసం అర్హులైన పేదలు ఎదురు చూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పత్తికి గిట్టుబాటు ధర లభించడం లేదు. ఈ నేపథ్యంలో పత్తి కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలు సడలించి అయినా సరే కనీస మద్దతు ధరకు రైతుల వద్ద కొనుగోలు చేసేలా చూడాలని పత్తి రైతులు వేడుకుంటున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. గుంతలమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి అపారమైన అవకాశాలున్నా ఆ శాఖ పట్టించుకోవడం లేదు. ఉండవల్లి గుహలు, ఉప్పలపాడు పక్షి కేంద్రం, పొన్నూరు దేవాలయాలు, తెనాలిలో సాగునీటి కాలువలు, నగర శివారులో శిల్పారామం వంటి వాటిని అభివృద్ధి చేసి పర్యాటకంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

టీడీపీ చిర్రావూరు అధ్యక్షుడిగా కాసరగడ్డ శ్రీనివాస్

తాడేపల్లి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం చిర్రావూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా కాసరగడ్డ శ్రీనివాస్‌ను నియమించారు. మంత్రి నారా లోకేశ్ ఆదేశాల ప్రకారం శ్రీనివాస్‌ను ఈ పదవిలో నియమించారు. ఇప్పటి వరకు గ్రామ అధ్యక్షుడిగా వీరిశెట్టి శ్రీనివాస్ వ్యవహరించారు. కాసరగడ్డ శ్రీనివాస్ నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

భక్తి శ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

తుళ్లూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): భక్తి శ్రద్ధలతో తుళ్లూరు కొత్తూరు కోదండ రామ స్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. తెల్లవారుజామున యంత్ర ప్రతిష్ఠ, ధ్వజ ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి, ప్రాణప్రతిష్ఠ కళావాహన నిర్వహించి ప్రతిష్ఠ పూర్తి చేశారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కాకుమాను వెంకటేశ్వరావు శ్రీలక్ష్మీ దంపతుల సారధ్యంలో కోదండరామస్వామి భక్త కమిటీ అధ్వర్యంలో ఈ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. ఈ పందర్భంగా ఉదయం పది గంటల నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు ధ్వజస్తంభ ప్రతిష్ఠకు హాజరయ్యారు.

క్రైమ్ జోన్

కౌలు రైతు ఆత్మహత్య



వీరారావు (ఫైల్ ఫొటో)

ప్రత్తిపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో పురుగుమందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ప్రత్తిపాడులో జరిగింది. ప్రత్తిపాడు పోలీసుల కథనం ప్రకారం ప్రత్తిపాడు గ్రామానికి చెందిన యనగందుల వీరారావు (54) కౌలుకు భూమిని తీసుకుని వ్యవసాయం చేశాడు. గతంలో కొప్పర్రులో పొలం తీసుకుని వ్యవసాయం చేయగా, రెండేళ్లుగా గొట్టిపాడులో 5 ఎకరాల పొలం కౌలుకు తీసుకుని మిర్చి పంట సాగు చేశాడు. తెగుళ్ల కారణంగా పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోవడంతో వచ్చిన కొద్దిపాటి మిర్చిని కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేశాడు. ఇప్పటి వరకు రూ.6.89 లక్షలు అప్పులు కావడం, అప్పులిచ్చిన వారికి స్టోరేజీలో ఉన్న మిర్చి అమ్మి బకాయిలు తీరుస్తానని చెబుతూ వస్తున్నారు. తీరా ఆ మిర్చిని అమ్మగా వచ్చిన రెండు లక్షల రూపాయల్లో ఏసీ అద్దెతో పాటు తీసుకున్న లోను పోగా చేతికి రూ.77 వేలు వచ్చాయి. అప్పులు ఇచ్చిన వారికి తన మొఖం ఎలా చూపించేది అనుకుని ఈ నెల 23న వీరారావు ఇంట్లో ఉన్న పురుగు మందు తాగాడు. అప్పటి నుంచి గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

జూదస్థావరంపై దాడి

దుగ్గిరాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పేకాట శిబిరంపై దుగ్గిరాల పోలీసులు చేసిన ఆకస్మిక దాడిలో రూ.63వేలు స్వాధీనం చేసుకుని, 12మందిని అదుపులోకి తీసుకున్నారు. మోరంపూడిలోని పొలాల్లో కొందరు ఆదివారం సాయంత్రం పేకాడుతున్న సమాచారం తెలుసుకున్న ఎస్ఐ వెంకటరవి, తన సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడిచేసినట్లు తెలిపారు.

కాల్వలో పడి యువకుడు గల్లంతు

దుగ్గిరాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల డీపీ అగ్రహారానికి చెందిన సుధాకర్ మద్రాసు కాల్వలోకి దూకాడు. పెయింటర్‌గా పని చేసే సుధాకర్ రైల్వేబ్రిడ్జి సమీపంలో కాల్వలోకి దూకినట్లు పోలీసులకు సమాచారం అందించారు. యువకుడి మృతదేహం లభ్యం కాలేదని, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటరవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని పొత్తూరు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియనివ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి జరిగింది. పొత్తూరు వద్ద సర్వీస్ రోడ్డుపై ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదానికి కారణమైన వాహనం ఆగకుండా వెళ్ళిపోయింది. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వయసు సుమారు 25 సంవత్సరాలు ఉంటుందని సమాచారం. మృతుని సమాచారం తెలిసిన వారు నల్లపాడు పోలీస్‌స్టేషన్ సీఐని 86888 31376 నంబరులో సంప్రదించాలని కోరారు.

రోటో ఫెస్ట్-2024 ప్రారంభం

గుంటూరు(తూర్పు), అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో రోటరీ క్లబ్ గుంటూరు ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జరిగే క్రీడా ఉత్సవాలు 'రోటో ఫెస్ట్ 2024' ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన క్లబ్ జిల్లా గవర్నర్ శరత్ చౌదరి క్రీడా ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో క్రీడా నైపుణ్యాలను, మానసిక ధైర్యాన్ని వెలికి తీసేందుకు ప్రతి ఏడాది అంతర్జాతీయంగా రోటో ఫెస్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు గాలి సుబ్బారావు పోటీల వివరాలు తెలిపారు.

శిథిల వంతెనపై బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు

- వంతెనపై ఇరువైపులా కానరాని రెయిలింగ్‌లు
- సచివాలయ మార్గంలో ప్రమాదభరిత వంతెన





రెయిలింగ్‌లు విరిగిపోయిన వంతెన, శిథిలవంతెనపై వెళుతున్న వాహనాలు

తాడేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈ మార్గం ద్వారా నిత్యం పలువురు మంత్రులు, అధికారులు, వీఐపీలు బస్సుల ద్వారా కార్ల ద్వారా ప్రయాణికులు సచివాలయం వైపు వెళుతుంటారు. రాజధాని మార్గంలో మూడు దశాబ్దాల క్రితం అప్పటి జడ్పీ చైర్మన్ యడ్లపాటి వెంకట్రావు హయాంలో తాడేపల్లి మండలం పెనుమాక - కృష్ణాయపాలెం మధ్యలో కొండవీటి వాగుపై జడ్పీ నిధులతో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా మారింది. ఈ మార్గాన క్షణక్షణం భయంభయంగా ప్రయాణాలు చేస్తున్నారు. వంతెనపై ఇరువైపులా రెయిలింగ్‌లు లేకపోవడంతో ఏ చిన్న ప్రమాదం జరిగినా వాహనాలు డైరెక్ట్‌గా వాగులో పడడం ఖాయం. ఈ శిథిలావస్థ వంతెనపై నిత్యం ఆర్టీసీ బస్సులు, పలు వాహనాలు వెళుతుంటాయి. వంతెన ప్రారంభం నుంచి రహదారి ఆసాంతం గుంతలమయంగా మారింది. ఈ మార్గంలో వంతెన



పెనుమాక - కృష్ణాయపాలెం వంతెన

వద్ద విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో రాత్రిపూట ఈ మార్గంలో ప్రయాణం కష్టతరంగా ఉంటోంది. వెలగపూడి సచివాలయానికి వెళ్లే మంత్రులు, అధికారులు ఉండవల్లి, పెనుమాక కృష్ణాయపాలెం మీదుగా ఈ వంతెన దాటుతూ దగ్గర దారి కావడంతో సచివాలయానికి నిత్యం ప్రయాణిస్తుంటారు. ఇంత ప్రాశస్త్యమున్న ఈ రహదారి వంతెన ఆలనా పాలనా లేక కునారిల్లుతోంది. గతంలో జగన్ ప్రభుత్వ హయాంలో అసెంబ్లీ సమావేశాల సమయంలో పోలీసులు రెయిలింగ్‌లు లేని చోట వంతెనపై అడ్డుగా భద్రత కోసం బాదులు కట్టి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వాలు మారినా ఈ వంతెన అభివృద్ధి మాత్రం మారలేదని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. అందరికి పనికి వచ్చే ఈ వంతెనను వెంటనే అభివృద్ధి చేయాలని గ్రామస్థులు ప్రయాణికులు కోరుతున్నారు.

డబుల్ లేన్ వంతెన నిర్మించాలి

- పఠాన్ జానీఖాన్, పెనుమాక

పెనుమాక, కృష్ణాయపాలెం మార్గంమధ్యలో ట్రాఫిక్ రద్దీ బాగా పెరిగింది. ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. కొండవీటి వాగు మీద ఉన్న ఈ వంతెనను మంత్రి నారా లోకేశ్ పట్టించుకొని డబుల్ లేన్ వంతెనగా మార్చితే గ్రామస్థులకు సచివాలయానికి వెళ్లే ప్రయాణికులు అధికారులు, ప్రజాప్రతినిధులకు వెసులుబాటుగా ఉంటుంది. వాహనదారులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. రెయిలింగ్‌లు పోయి ప్రస్తుతం వంతెన ప్రమాదభరితంగా కనిపిస్తోంది. వెంటనే మరమ్మతులు నిర్వహించాలి

భారీ లారీలతో ఇబ్బంది

● పులి మధుసూదనరావు కృష్ణాయపాలెం

పెనుమాక కృష్ణాయపాలెం వంతెన ద్వారా భారీగా లారీలు ఇసుక టిప్పర్లు నిత్యం తిరుగుతున్నాయి. కొన్ని రోజులు పోతే వంతెన మనుగడే ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. వంతెన రహదారి గుంతలమయంగా మారింది. వంతెన వద్ద లైట్లు కూడా వెలగడం లేదు. మంత్రి లోకేశ్ స్పందించి నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గం వంతెనపై దృష్టి సారించి నూతన వంతెన నిర్మిస్తే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పుతాయి.

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ పరమావధి

● టీడీపీ జిల్లా కార్యవర్గ కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు



ఫిరంగిపురంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా కార్యవర్గ కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు

ఫిరంగిపురం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ పరమావధని టీడీపీ జిల్లా కార్యవర్గ కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఫిరంగిపురంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సభ్యత్వ నమోదు సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వం అంటే సభ్యులకు గౌరవం, ధైర్యం, భరోసా, గొప్పతనంగా భావించాల్సి ఉంటుందన్నారు. సీఎం నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌లు సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5 లక్షలు ప్రమాద బీమా, సాధారణ మృతికి రూ.10వేలు పార్టీ ద్వారా ఇవ్వనున్నారన్నారు. దేశంలోనే ప్రజలకు సంక్షేమం అందించే పార్టీ తెలుగుదేశం పార్టీయేనని ఆయన తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు మండవ నరసింహారావు మాట్లాడుతూ సభ్యత్వం ద్వారా పార్టీని బలోపేతం చేయాలని ఆయన కోరారు. మండల ప్రధాన కార్యదర్శి కటికల రామకోటేశ్వరరావు మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన పార్టీలో తలెత్తుకొని జీవించే అవకాశం తెలుగుదేశం పార్టీలో ఉందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో గోలి బాలజోజి, నలజర్ల అప్పయ్య, శేషం శ్రీనివాస్, బీ చిన మస్తాన్‌రెడ్డి, ఆరే పున్నారెడ్డి, పీ హృదయరాజు, మేకల నాగేశ్వరరావు, పచ్చల రత్నరాజు, సంపతి నాగేశ్వరరావు, షేక్ బుజ్జి, కొలగాని కొండలు, సర్పంచ్ సుభానీ, పోలిశెట్టి రాజారావు, వేల్పుల అంకారావు పాల్గొన్నారు.

శాశ్వత సభ్యత్వం తీసుకున్న టీడీపీ నాయకులు

దుగ్గిరాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): టీడీపీలో శాశ్వత సభ్యత్వం చరిత్ర సృష్టించబోతోందా అనే తీరుగా సభ్యత్వ నమోదు కొనసాగుతోంది. దుగ్గిరాలకు చెందిన టీడీపీ వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావుతో పాటు గ్రామానికి చెందిన గద్దె శ్రీనివాస్ ఆన్‌లైన్ ద్వారా రూ.లక్ష చొప్పున చెల్లించి సభ్యత్వం తీసుకోవడం ద్వారా మండలంలోనూ శాశ్వత సభ్యత్వానికి శ్రీకారం చుట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా మంగళగిరి నియోజక వర్గం నుంచి గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు తొలి శాశ్వత సభ్యత్వం తీసుకున్న విషయం విదితమే. కాగా లోకేశ్ విదేశీ పర్యటన ముగించుకుని వచ్చాక మండలం నుంచి మరింత మంది శాశ్వత సభ్యత్వం తీసుకోనున్నట్లు చెబుతున్నారు.

కుర్నూతలలో విశేష స్పందన

వట్టిచెరుకూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్నూతలలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు అత్తోట బాలకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో మండల ఐటీ టీడీపీ అధ్యక్షుడు సయ్యద్ మస్తాన్‌వలి, బీసీ సెల్ అధ్యక్షుడు ఎడ్లూరి ఏసుబాబు, మాజీ సర్పంచ్, స్థానికులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమానికి టీడీపీలో ప్రాధాన్యం

● గుత్తికొండ ధనుంజయరావు

మంగళగిరి సిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ ప్రాధాన్యం వేస్తుందని బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు అన్నారు. పట్టణంలోని 8వ వార్డు ఆంజనేయకాలనీలో ఆదివారం సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వి.లక్ష్మయ్య, అలుగూరి రాజశేఖర్, జొన్నాదుల నాగమల్లేశ్వరరావు, దుర్గారావు, తిరుమలశెట్టి హనుమంతరావు, బాబూరావు, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏసీసీ భూముల్లో జెండాలు పాతిన కార్మికులు

- నిరసన ప్రదర్శన నిర్వహించిన వివిధ యూనియన్ల ప్రతినిధులు
- ఫ్యాక్టరీ కార్మికులకు భూములైనా ఇవ్వండి.. పరిహారమైనా చెల్లించండి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు



ప్రదర్శనలో పాల్గొన్న వివిధ కార్మిక యూనియన్ల ప్రతినిధులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులకు కోర్టు తీర్పు ప్రకారం రావలసిన బకాయిలు యాజమాన్యం చెల్లించాలని లేదా సిమెంటు ఫ్యాక్టరీ భూములు కార్మికులకు అప్పగించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు డిమాండ్ చేశారు. ఆదివారం బ్రహ్మానందపురంలోని ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావలసిన బకాయిల కోసం ఫ్యాక్టరీ భూముల్లో జెండాలు పాతారు. తొలుత కార్మిక కుటుంబాలవారు పిల్లా పాపలతో కలిసి యూనియన్ కార్యాలయానికి ప్రదర్శనగా వచ్చి అక్కడ ఏసీసీ భూముల్లో తాము తెచ్చుకున్న బొంగులతో గుడిసెలు వేసుకున్నారు. యాజమాన్యం తమకు నష్టపరిహారం ఇవ్వాలని లేదా రావలసిన బకాయిల ప్రకారం భూమినైనా ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నేత కూరపాటి స్టీవెన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నేత చిగురుపాటి బాబూరావు మాట్లాడు తూ 1983లో ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్‌కు గురైం దని, దశాబ్దాలు గడిచినా ప్రభుత్వాలు సిమెంటు కంపెనీ కార్మికులకు న్యాయం చేయలేదన్నారు. ఇప్పటివరకు అర్థాకలితో 178 మంది కార్మికులు మృతి చెందారన్నారు. 30 ఏళ్ల పైబడి కార్మికులు చేస్తున్న పోరాటం కీలక దశకు చేరుకుంద న్నారు. కోర్టులు రూ.43కోట్ల వరకు కార్మికులకు చెల్లించాలని చెప్పినా ఇంతవరకు చెల్లించలేద న్నారు. ఈ భూములను ప్రభుత్వం సాధీనం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ మాట్లాడుతూ కార్మికులు అడుగుతోంది భిక్ష కాదని, తమ కష్టార్జిత హక్కని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు వై నేతాజీ, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు, కొట్టే కరుణాకర్, శ్రీనివాసరెడ్డి, సీపీఐ నేతలు, ఎంఎల్ నాయకులు, ఐఎఫ్‌టీయూ నేత చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నివేశన స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

● మాజీ ఎమ్మెల్సీ విల్సన్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విల్సన్

దుగ్గిరాల (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 27: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు 3సెంట్ల స్థలం, నిర్మాణానికి రూ.5లక్షలు అందించాలని మాజీ ఎమ్మెల్సీ జల్లీ విల్సన్ డిమాండ్ చేశారు. దుగ్గిరాలలోని సత్యసాయి కల్యాణమండపంలో ఆదివారం జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ విల్సన్ పాల్గొన్నారు. వ్యవసాయ కార్మికసంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల శేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని, ఎన్నికల ముందుగా చెప్పిన ప్రకారం సూపర్ 6 కూడా అమలు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు నామమాత్రంగా అమలు జరుగుతున్నాయన్నారు. డిసెంబరు 18న అన్ని గ్రామ సచివాలయాల్లో సామూహిక దరఖాస్తులు అందించనున్నామన్నారు. ప్రతి ఒక్కరికి పక్కా గృహాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. గతప్రభుత్వం పేదలకు అరకొరగా సెంటు భూమి కేటాయించి ఏఒక్కరికీ ఉపయోగం లేకుండా చేసిందన్నారు. రావుల శేఖర్ మాట్లాడుతూ, కార్మికుల కోసం జాతీయ ఉపాధిహామీ కింద రెండువందల పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 అందించాలని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జంగాల అజయ్‌కుమార్, చిన్ని తిరుపతయ్య, జాలాది జాన్‌బాబు, యార్లగడ్డ శివయ్య కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

జీఎంసీ గోశాలలో మౌలిక వసతులకు కమిషనర్ ఆదేశాలు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ గోశాలలో ఆవులకు మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమివ్వాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కమిషనర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక వెంగళాయపాలెంలోని జీఎంసీ గోశాలను ఆదివారం ఆయన పరిశీలించారు. తీసుకోవాల్సిన చర్యలపై ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ గోశాలలో ఆవులను శుభ్రం చేయడానికి, నీరు బయటకు వెళ్లడానికి వీలుగా ప్లాట్ ఫారంని ఏర్పాటు చేయాలన్నారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 36 వేల 250 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఎగువన ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 52 వేల 399 క్యూసె క్కుల వరద నీరు ఆదివారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 50 గేట్లను అడుగు మేర ఎత్తి దిగువకు 36 వేల 250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టా కాలువలకు 9 వేల 435 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా కాలువకు 6 వేల 714 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు జేఈ తెలిపారు.

పశ్చిమ డెల్టా కాల్వకు 6714

దుగ్గిరాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 6714 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటి పారు దలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దిగువకు 36,250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 306 క్యూసెక్కులు, రేపల్లెకాల్వకు 1760 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 573, పశ్చిమకాల్వకు 180 క్యూసెక్కులు, నిజాంపట్నంకాల్వకు 415 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 3120 క్యూసె క్కుల నీరు, విడుదల చేస్తున్నారు.

నేడు 'డయల్ యువర్ కమిషనర్'

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సమస్యల పరిష్కారానికి 28వ తేదీ ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు గుంటూరు నగరపాలక సంస్థ కమిష నర్ చాంబర్‌లో 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వీధి దీపాలు, సచివాలయ సేవలు, మౌలిక సదు పాయాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి 0863-2224202 నంబర్‌కి కాల్ చేయాలని తెలిపారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన

గుంటూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నానాటికీ పెరుగుతున్న కిడ్నీ వ్యాధులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని డాక్టర్ వీ వెంకటనాయుడు పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆరోగ్యసభలో ఆయన మాట్లాడారు.



దుగ్గిరాలలో పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియలో పాల్గొన్న టీడీపీ నాయకులు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు విశేష స్పందన

● 200 మందికి పైగా సభ్యత్వం కోసం దరఖాస్తుల స్వీకరణ

దుగ్గిరాల, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలో ఆదివారం నిర్వహించిన పట్టభద్రుల ఓటునమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. గ్రామంలోని సెంట్రల్ వేర్‌హౌస్, జమ్మిచెట్టు సెంటర్, ఆలీనగర్, పెద్ద చర్చిల వద్ద ఏర్పాటు చేసిన శిబిరాల్లో జరిగిన ఓటు నమోదు కోసం, యువకులతో పాటు, పట్టభద్రులైన వారు ఫారం -18తోపాటు, డిగ్రీ పాస్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, ఓటర్‌కార్డ్ జిరాక్స్ కాపీ, పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోలను అందించారు. 200 మందికి పైగా పట్టభద్రుల ఓటు నమోదులో టీడీపీ నాయకులు గూడూరు వెంకట్రావు, గద్దె శ్రీనివాస్, వల్లూరు నరసింహారావు, నక్కా చిరంజీవి, జున్నూ ఖాన్, లియాఖత్, ఎద్దు ప్రసాద్, షేక్ ఫిరోజ్, నన్నెపాగ ప్రభాకర్, పులివర్తి రమేష్, కరీముల్లా, బాషా, నరేష్, రవి, పేర్లి వంశీ, కాకాని శ్రీను, వేదవతి, లాలూనాయక్ పాల్గొన్నారు.

తుళ్లూరులో క్యాంపెయిన్

తుళ్లూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) ఎమ్మెల్సీ ఓటుకు, టీడీపీ సభ్యత్వ నమోదుకు క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్టు తుళ్లూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాటా అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తుళ్లూరు సినిమాహాలు సెంటర్‌లో ఈ కార్యక్రమం ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ నమోదు పక్రియలో పాల్గొని టీడీపీ సభ్యత్వం, ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలని కోరారు.

మూడు చక్రాల బండి అందజేత



మూడు చక్రాలబండి అందజేస్తున్న టీడీపీ నేత కాట్రగడ్డ మధు

తాడేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం గ్రామంలోని హల్లెలూయ ప్రార్థనా మందిరం వ్యవస్థాపకుడు పాస్టర్ శ్యామ్‌సన్‌కు చర్చి అవసరాల నిమిత్తం టీడీపీ సీనియర్ నేత కాట్రగడ్డ మధుసూదనరావు మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో రూ.16వేల ఖరీదు చేసే మూడు చక్రాల బండిని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఈపూరి కోటయ్య, కాట్రగడ్డ మధుసూదనరావు, షేక్ నాగుర్‌వలి, షేక్ ఇమాంసా, వడ్డేశ్వరం అబ్రహం, కంచర్ల కోటేశ్వరరావు, తంబి, బాబు, తదితరులు పాల్గొన్నారు.

మలినేనిలో ముగిసిన 15 వసంతాల వేడుకలు



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులతో కళాశాల చైర్మన్, తదితరులు

వట్టిచెరుకూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల ఏర్పాటు చేసి 15 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వేడుకగా ఆదివారం ముగిశాయి. విద్యార్థినులు వివిధ రూపాల్లో నిర్వహించిన కార్యక్రమాలు అంబరాన్ని అంటాయి. ఈ సందర్భంగా మలినేని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు మాట్లాడుతూ కళాశాల ఇంతగా అభివృద్ధి చెందడానికి పూర్వ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువ లేనిదన్నారు. కళాశాల అడ్మిషన్స్ డీన్ పోపూరి రమేష్ మాట్లాడుతూ ప్రస్తుత ఇంజనీరింగ్ కళాశాలల మధ్య ఉన్న పోటీ పరిస్థితుల్లో ప్రతి సంవత్సరం ఉత్తమ ప్రతిభను కనబరచడంలో పూర్వ విద్యార్థుల సహకారం ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జెట్టి అప్పారావు, డీన్ ప్రొఫెసర్ కిషోర్‌బాబు, సంస్థ డైరెక్టర్ శ్రీనివాస కుమార్, వివిధ విభాగాధిపతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి వైద్యశిబిరంలో పాల్గొన్న తానాకు చెందిన కొల్లా అశోక్‌బాబు, జే వెంకట్, టీడీపీ స్థానిక నాయకులు గింజుపల్లి శివరామప్రసాద్ తదితరులు

ప్రత్తిపాడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దోసా ఫౌండేషన్, ఉయ్యూరు ఫౌండేషన్ ఫాంగ్‌టెక్ వారి సమకారంతో ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఇక్కడ నిర్వహించిన ఈ వైద్యశిబిరాన్ని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరాంప్రసాద్ ప్రారంభించారు. శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య బృందం ఉచిత వైద్యసేవలు అందించింది. మొత్తం 203 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో శస్త్రచికిత్సల కోసం 93 మందిని ఎంపిక చేశారు. వీరిలో తొలి విడతగా సుమారు 40 మందిని వైద్యశాలకు తరలించారు. యూఎస్ఏ తానాకు చెందిన కొల్లా అశోక్‌బాబు, జే వెంకట్‌ల ఆధ్వర్యంలో ఈ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాకాని సురేష్‌బాబు, పమిడి శ్రీనివాసరావు, తెలుగుయువత అధ్యక్షుడు చిన్నం శ్రీనివాసరావు, కాసు పెంటారెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలు, గోడౌన్‌ల వద్ద

భద్రతా ప్రమాణాలు పాటించాలి

- లైసెన్సులు తనిఖీ చేయాలి
- అక్రమ విక్రయాలు జరిపితే కఠిన చర్యలు
- అక్రమ నిల్వలపై ఫిర్యాదుకు 8688831568,100
- ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలు



ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రానున్న దీపావళి పండుగను పురస్కరిం చుకుని జిల్లా వ్యాప్తంగా బాణసంచా దుకాణ దా రులు, గోడౌన్లు వద్ద భద్రత ప్రమా ణాలను పాటించాలని ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశించారు. జిల్లాలో ఫైర్ డిపార్టుమెంట్ అధికారులతో కలిసి ఆదివారం పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దీపావళి పండగ వస్తున్న నేపథ్యం లో బాణసంచా విక్రయించే షాపులు, గోడౌన్లు, లైసెన్సులు తనిఖీ చేయాలని, భద్రత ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అదే సమయంలో అనధికారంగా బాణసంచా విక్రయాలు జరగకుండా చూడాలని, నిబంధనలు ఉల్లం ఘించే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. బాణసంచా షాపులు, గోడౌన్లు వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా, ముందస్తు భద్రత చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాణసంచా అక్రమ విక్రయాలు, అక్రమ నిల్వలపై సంబంధిం చిన సమాచారం ఉంటే జిల్లా పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 8688831568లో లేదా 100కు సమాచారం తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ స్పష్టం చేశారు.

డి-3 సెక్షన్‌లో విద్యుత్ నిలిపి వేత

తెనాలి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : 33 కేవీ బ్రేకర్ మరమ్మతుల కారణంగా డి-3 సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరా సోమవారం నిలిపి వేస్తామని డీఈ అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.


రోగులకు వైద్యసేవలందిస్తున్న డాక్టర్ శారద

షుగరువ్యాధిగ్రస్థులు ఆహార నియమాలు

తప్పక పాటించాలి

తెనాలి రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): షుగర్ వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా ఆహార నియమాలు పాటించాలని శారదాసర్వీస్ సొసైటీ నిర్వాహకురాలు డాక్టర్ శారద చెప్పారు. బుర్రిపాలెం రోడ్డులోని ఎస్ బిల్డింగ్‌లో ఆదివారం షుగర్, బీపీ ఇతర అనారోగ్య సమస్యలున్న సుమారు 200 మందికి ఉచితంగా వైద్యసేవలు అందించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ మంచి ఆరోగ్యకరమైన జీవనాన్ని గడిపేందుకు వ్యాయామం తప్పనిసరి అన్నారు. ప్రతి ఒక్కరూ ఉదయం, సాయంత్రం సమయాల్లో కొంత దూరం నడవడం మంచిదన్నారు. దీని ద్వారా వత్తిడి తగ్గి మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్రతి రోజు తీసుకునే ఆహారంలో ఆకుకూరలు, తాజాకూరగాయలను తీసుకోవడం మంచి దన్నారు. బయట ఆహారాన్ని సాధ్యమైనంత వరకు దూరంగా ఉండటం ద్వారా అనారోగ్య సమస్యల నుంచి బయటపడవచ్చని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్స్‌పై

పైకప్పును నిర్మించరూ !

తెనాలి మారీసుపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యనారాయణ టాకీస్ రోడ్డులో పెరుగు మార్కెట్ వద్ద ప్రజల కొరకు ఏర్పాటు చేసిన యూరినల్ పబ్లిక్ టాయిలెట్స్ పైకప్పు అధికారుల నిర్లక్ష్యంతో కూలింది. కొన్ని నెలలుగా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో అది నిరుపయోగంగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు. కొంతమంది ప్రజలు రోడ్లపైనే మూత్ర విసర్జన చేస్తున్నారని, అపరిశుభ్ర వాతావరణం ఏర్పడిందని వార్డు ప్రజలు అంటున్నారు. ఆ దారి నుంచి వెళ్లాలంటే దుర్గంధంతో ముక్కుమూసుకొని వెళ్లవలసి వస్తుందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పబ్లిక్ టాయిలెట్‌కు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బాణసంచా గోడౌన్‌ల వద్ద

భద్రతా చర్యలు పాటించాలి

గుంటూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా బాణాసంచా దుకాణాలు, గోడౌన్లు వద్ద నిర్వాహకులు భద్రత ప్రమాణాలను పాటించాలని ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. జిల్లాలో అగ్నిమాపకశాఖ అధికారులతో పాటు కలిసి ఆదివారం వివిధ ప్రాంతాల్లో ఎస్పీ పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ దీపావళి నేపథ్యంలో బాణసంచా విక్రయించే షాపులు, గోడౌన్లును, వ్యాపార లైసెన్సులను తనిఖీ చేయాలని, బాణసంచా షాపులు, గోడౌన్ల వద్ద ప్రమాదాలు జరగకుండా ముందస్తు భద్రత చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఏవేని ఫిర్యాదులు, సమస్యలు ఉంటే జిల్లా పోలీస్ కంట్రోల్ రూం నెంబర్ 8688831568, 100కు సమాచారం అందజేయాలని ఎస్పీ సూచించారు.


రాజేంద్రప్రసాద్, రతన్‌టాటా చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు

రాజేంద్రప్రసాద్, రతన్‌టాటాలకు

ఘన నివాళులు

తెనాలి అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సీనియర్స్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మహాప్రస్థానం సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉయ్యూరు రాజేంద్ర ప్రసాద్ సంస్మరణ సభ నిర్వహించారు. కవిరాజా పార్కులో జరిగిన కార్యక్రమంలో దేశ పారిశ్రామిక రంగంలో విశిష్ట సేవలు అందించిన రతన్‌టాటాతో పాటు రాజేంద్ర ప్రసాద్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొవ్వా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎన్నారై డాక్టర్ బాబూ ఆర్ వడ్లమూడి మాట్లాడుతూ, మహాప్రస్థాన సమితిని స్థాపించి ఎన్నో సేవలు అందించారని చెప్పారు. దేశంలో పారిశ్రామిక రంగంలో తనదైన పాత్ర పోషించి లక్షలాది మందికి ఉపాధి ఇచ్చారని, దేశాన్ని ఆదుకునేందుకు ఏ మాత్రం వెనుకాడకుండా తన యావదాస్తి కూడా అవసరమైతే ఇచ్చేస్తానన్న రతన్ టాటా ప్రపంచానికే ఆదర్శమన్నారు. డాక్టర్ అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యశాల

కథ కంచికేనా?

- స్వాతంత్ర్యం రాకముందు నుండే వైద్యశాల సేవలు
- భవనం శిథిలావస్థకు చేరినా కొనసాగిన వైద్యం
- నేడు వారంలో ఒక్క రోజు మాత్రమే ఓపీ సేవలు
- కొలకలూరు ఆసుపత్రి సేవలు కొనసాగించాలని వినతి

దశాబ్దాల చరిత్ర ఉన్న ఆయుర్వేద వైద్యశాల అది. తరతరాల నుంచి ఎందరో అనారోగ్య సమస్యలతో ఉన్నవారికి మంచి వైద్యం అందించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దిన కీర్తి ఆ ఆసుపత్రి సొంతం. ఇంతటి ప్రసిద్ధి చెందిన ఆయుర్వేద ఆస్పత్రి గత కొన్ని సంవత్సరాలుగా గ్రామంలోని ఆయుర్వేద వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఆ తర్వాత భవనం ఆధునికీకరణ నిమిత్తం ప్రజలు పలుమార్లు నేతలకు, అధికారులకు విజ్ఞప్తులు జేసినా ఫలితం లేకుండా పోయింది.



ఆయుర్వేద వైద్యశాల భవనం, వైద్యశాలలో పెంకులు రాలిపోయి ప్రమాదకరంగా ఉన్న పై కప్పు

తెనాలి రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరు గ్రామంలో 1945వ సంవత్సరంలో 10 సెంట్ల విశాల స్థలంలో పెంకులతో ఆయుర్వేద ఆసుపత్రిని నిర్మించారు. ఆ వైద్యశాల్లో డాక్టర్‌తోపాటు సిబ్బందిని కూడా నియమించారు. చిన్నపాటి అనారోగ్య సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే కొలకలూరు వైద్యశాలకు వచ్చి వైద్యం పొందేవారు. అదే ఆనవాయితీ కొలకలూరు గ్రామంలో కొనసాగుతూనే వచ్చింది. ఐతే కొన్ని సంవత్సరాలుగా గ్రామంలోని ఆయుర్వేద వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. దీనిపై గ్రామస్తులు పలుమార్లు వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకులకు, సంబంధిత అధికారులకు నూతన భవనం నిర్మించి పూర్వీకుల నుంచి తమకు అందుతున్న ఆయుర్వేద వైద్యశాల సేవలను కొనసాగేలా చూడాలని వినతిపత్రాలు అందించారు. నూతన భవనాన్ని నిర్మించి వైద్యసేవలు కొనసాగిస్తామని హామీలను సైతం ఇచ్చారు. శిథిలావస్థలో ఉన్న వైద్యశాల నూతన హంగులతో మంచి వైద్యం అందించనున్నదని సంతోషంతో వేచిచూశారు. అయితే ఎవరూ ఊహించని విధంగా వైద్యశాల సేవలు నిలుపుదల అయ్యాయి. ఆ గ్రామంలోని వైద్యశాల్లో పనిచేసే వైద్యురాలిని మరో గ్రామానికి, సహాయకుడిని సైతం ఇంకో గ్రామానికి మార్చారు. దీంతో వైద్యశాలకు తాళం పడింది. వారంలో ఒక్కరోజు కేవలం సోమవారం మాత్రమే వైద్యురాలు ఒకరు వచ్చి తాళాలు తీసి ఆ సమయంలో వచ్చే వారికి మాత్రం వైద్యం అందించి ఆయుర్వేద మందులు ఇస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో గ్రామంలోని ఆయుర్వేద వైద్యశాల ప్రజలకు భరోసా కల్పిస్తూ మందులు పంపిణీ చేసి ఆ మహమ్మారి బారిన పడకుండా కాపాడిందని, ఆయుర్వేద వైద్యశాల గ్రామానికి సంజీవని వంటిదని వైద్యశాలసేవలు పొందేవారు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా గ్రామంలో వైద్యశాలపై దృష్టిపెట్టి శిథిలావస్థలో ఉన్న వైద్యశాల స్థానంలో నూతన భవనాన్ని నిర్మించి వైద్యసేవలు కొనసాగేలా చూడాలని ఆ గ్రామస్తులతోపాటు పరిసర గ్రామ ప్రజలు కోరుతున్నారు.

అనేక సార్లు అర్జీలు ఇచ్చాం.. ఎవరూ పట్టించుకోలేదు



గ్రామంలోని ఆయుర్వేద వైద్యశాలను తిరిగి ప్రారంభించాలని అనేక మంది అధికారుల వద్దకు వెళ్లి అర్జీలు అందించాం. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ఒక్కరూ దానిపై స్పందించలేదు. గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేయడంతో వారంలో ఒక్కరోజు తెరచి వైద్యం అందిస్తున్నారు. మిగిలిన రోజులు అనారోగ్యసమస్యలతో కేంద్రాన్ని సంప్రదిస్తే పట్టించుకునే వారే లేరు. కూటమి ప్రభుత్వమైనా తమ గ్రామంలో తిరిగి ఆయుర్వేద వైద్యశాలను కొనసాగించాలని కోరుతున్నాం. - **తోట లక్ష్మయ్య, గ్రామస్థుడు**

కాల్వలో వ్యర్థాలు వేస్తే చర్యలు

● మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు హెచ్చరిక

పొన్నూరుటౌన్, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి) : మురుగు కాల్వలలో నీటి ప్రవాహానికి అడ్డుగా వ్యర్థాలను వేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు హెచ్చరించారు. పట్టణంలోని పాతపొన్నూరు 24వ వార్డులో ఆదివారం కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను కలుసుకొని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మురుగు కాల్వలో పూడికతీత పనులు చేపట్టాలని పారిశుధ్య కార్మికులకు సూచించారు. వీధులు, రహదారుల వెంట ఉన్న చెత్తచెదారాలు, వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. పాతపొన్నూరు శివాలయాన్ని పరిశీలించారు. కార్తీక మాస ప్రారంభం కానున్నందున ఆలయానికి ప్రతి రోజూ పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని అర్చక స్వాములు తెలియజేసారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయం వద్ద పారిశుధ్య పనులు చేపట్టాల్సిందిగా కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.


కాల్వల్లో వ్యర్థాలను పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్‌బాబు


సంస్థను ప్రారంభిస్తున్న కుమార్ పంప్స్ ఎండీ సుబ్రహ్మణ్యం

మారుతున్న వ్యాపార

దృక్పథాలను అందుకోవాలి

తెనాలి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మారుతున్న వ్యాపార దృక్పథాలను అందుకోవాలని కుమార్ పంప్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం చెప్పారు. సత్యనారాయణ టాకీసు రోడ్డులో ఏర్పాటు చేసిన గీతా ఆర్ట్స్ క్రియేషన్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఫ్లెక్సీ ప్రింటింగ్ రావడం వలన ఎంతోమంది చేతివృత్తి కళాకారులకు ఉపాధి పోయిందంటూ వారు కూడా కొత్త విధానాన్ని అందిపుచ్చుకుని ఎల్ఈడీ బోర్డ్స్, ఫ్లెక్సీ డిజైన్స్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. కాకతీయ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు, కొత్త కృష్ణకుమార్, కాటూరి వెంకటేశ్వరరావు, నాగరాజు, సాయిబాబు పాల్గొన్నారు.

డ్రాపవుట్స్‌ను తగ్గిస్తున్నాం

తెనాలి రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలబాట ద్వారా స్కూల్ డ్రాప్‌అవుట్‌లను తగ్గిస్తున్నామని డాక్టర్ పీ.రంజన్ బాబు చెప్పారు. మండలంలోని అంగలకుదురులో సొసైటీ ద్వారా ఆదివారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.రోస్‌ల్యాండ్, వినయ్‌కుమార్, అనిత, రవికుమార్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో విజేతలకు బహుమతి

తెనాలి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్యవైశ్య వ్యాయామ మందిర్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన తైక్వాండో పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గుంటూరు జిల్లా జట్టు అత్యధిక పతకాలు సాధించింది. మాజీ కౌన్సిలర్ గుమ్మడి రమేష్, టీడీపీ అధికార ప్రతినిధి ఈదర పూర్ణచంద్, ఆదినారాయణ, వెంకటేశ్వరరావు, సత్యం, కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు విజేతలకు బహుమతులు అందజేశారు.


హ్యాండ్‌బాల్ పోటీలలో తలపడుతున్న బాలికలు

సెమీ ఫైనల్స్‌కి చేరిన

హ్యాండ్‌బాల్ పోటీలు

తెనాలి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు సెమీ ఫైనల్స్‌కి చేరాయి. చెంచుపేట ఇండోర్ స్టేడియంలో ఆదివారం బాలుర, బాలికల జట్ల మధ్య హోరాహోరి పోటీ జరిగింది. గుంటూరు బాలుర, బాలికల జట్లు నెల్లూరు, శ్రీకాకుళం జట్లపై గెలిచి సెమీ ఫైనల్‌కి చేరాయి. సోమవారం సెమీ ఫైనల్స్, ఫైనల్స్ పోటీలు నిర్వహిస్తారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీలను కార్యదర్శి వినయ్‌కుమార్, బి.వెంకటేశ్వరరావు, నాగరాజు పర్యవేక్షించారు. ఆదివారం రాత్రి క్యాంప్ ఫైర్ నిర్వహించి క్రీడాకారులు సందడి చేసుకున్నారు.

విద్యార్థుల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలి

● రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావు

తెనాలి రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనిస్తే వాటికి గల కారణాలను తెలుసుకుని అవసరమైతే పోలీసుల సాయం కూడా పొందవచ్చని రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని సంగంజాగర్లమూడిలో రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం వారధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు మాదకద్రవ్యాలకు బానిసలైతే జరిగే ప్రమాదాలను, సెల్‌ఫోన్‌ల ద్వారా జరిగే ఆన్‌లైన్ మోసాలను, సోషల్ మీడియాలో అపరిచితుల పరిచయాలతో జరిగే పలు ఇబ్బందులను వివరించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసుల ద్వారా సహాయం పొందే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. రూరల్ ఎస్ఐ ప్రతాప్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ జయనాగలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ బెల్లం శ్రీనివాసరావు

విద్యార్థులకు రూ.19 లక్షలు ఉపకార వేతనాలు

తెనాలి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు 111 మందికి రూ.19 లక్షలు ఉపకార వేతనాలు అందజేశారు. వడ్లమూడి కోటయ్య చౌదరి చారిటీస్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్జీవో కళ్యాణ మండపంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ వడ్లమూడి గోవర్ధనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చెన్నై ఐఐటి ప్రొఫెసర్ ఎస్.రమేష్‌బాబు మాట్లాడుతూ, విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత స్థానం చేరాలని కోరారు. డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ, ప్రతి ఏటా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చేయూత అందించడం అభినందనీయమన్నారు. ఇప్పటి దాకా రూ.1.85 కోట్లు పంపిణీ చేయడం పేద విద్యార్థుల అదృష్టమన్నారు.


ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో ట్రస్టు సభ్యులు

సనాతన ధర్మాన్ని కాపాడాలి

తెనాలి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సనాతన హిందూ ధర్మాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని, శుభ కార్యాలలో సహపంక్తి భోజనం మాత్రమే ఏర్పాటు చేయాలని ఆంజనేయ ధ్యాన యోగ మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ కోరారు. యోగా మండలి ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను ఆదివారం పలు చోట్ల పంపిణీ చేశారు. ఆయన గృహంలో సహపంక్తి ప్రచార యజ్ఞాన్ని ప్రారంభించారు. ముంతా శ్రీనివాసరావు, ఇస్మాయిల్, తాడికొండ శ్రీనివాసరావు, కోమల, నాగరాజు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


బీమా చెక్కులు పంపిణీ చేస్తున్న రవిచంద్రన్

సామాజిక సేవలో వాసవీక్లబ్

● క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్రన్

తెనాలి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవలో వాసవీ క్లబ్ ముందుంటుందని క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్రన్ చెప్పారు. వాసవీ క్లబ్ తెనాలి టౌన్ ఇస్కాన్, తిరుమల సాయి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం క్లబ్ సభ్యుల కుటుంబాలకు బీమా సాయం పంపిణీ చేశారు. చెంచుపేట వృద్ధాశ్రమంలో నిత్యవసర సరుకులు, దుస్తులు, కుర్చీలు, ఫ్యాన్లు అందజేశారు. పొన్నూరు సుదీప్ కుటుంబ సభ్యులకు రూ.50 వేలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దాతల సహకారంతో క్లబ్ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. శివబ్రహ్మ ప్రసాద్, పద్మజకుమారి, పరమేశ్వరి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

12వ పే రివిజన్ కమిషన్‌ను నియమించాలి

తెనాలి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం 12వ పేరివిజన్ కమిషన్ నియమించాలని ఏపీ ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పీఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖల ఎస్టాబ్లిష్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు కోరారు. పట్టణంలోని బాలాజీరావుపేటలో రాష్ట్ర సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. 13 జిల్లాల నుంచి 90 మంది హాజరయ్యారు. వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 11వ పీఆర్సీ బకాయిలు, డీఏ, పీఎఫ్ బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాలను, మెడికల్ బిల్లులను చెల్లించాలని తీర్మానం చేశారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా రేహాన్, కోశాధికారిగా నూరుద్దీన్ మరో 12 మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నిక నిర్వహించారు. వాసిరెడ్డి వీరభద్రరావు, జి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

చేబ్రోలు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : చేబ్రోలులో ఆదివారం ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ గోకవరపు వెంకట కుమార్, డాక్టర్ జీవైఎస్ భాస్కర్, డాక్టర్ జి.లక్ష్మీ శ్రావణి ఆధ్వర్యంలో 300 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందచేశారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యం, పంచకర్మ చికిత్సల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు చేరువ

● రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావు

ఫటా ఫట్


రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావు

తెనాలి రూరల్, అక్టోబరు 27,(ఆంధ్రజ్యోతి): పోలీసులంటే భయం కాదు మీ రక్షణకోసం పనిచేసే ఉద్యోగులని, వారితో మమేకమవుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో నేర నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళతున్నామని రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆంధ్రజ్యోతి ప్రతినిధితో ఫటాఫట్

ప్ర: శాంతిభద్రతల పరిరక్షణకు ఎలా కృషి చేస్తున్నారు?

జ: గ్రామాల్లో ఎప్పటికప్పుడు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. గ్రామస్తులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ ముందస్తుగా ఆయా ప్రాంతాల సమస్యలు తెలుసుకుంటున్నాం. వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టి పరిష్కరిస్తూ శాంతి భద్రతలను పరిరక్షిస్తున్నాం.

ప్ర: చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా?

జ: ప్రతి గ్రామంలో పోలీసుల సహాయంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. తద్వారా బాధితులు పోలీసులను ఏ విధంగా సంప్రదించాలి. వారికి ఎలాంటి న్యాయం జరుగుతుంది. ఫిర్యాదుదారులపై ఎటువంటి సెక్షన్ల కింద కేసు నమోదు చేస్తాం. అనంతరం కోర్టు ద్వారా ఎటువంటి శిక్షలు పడతాయి అనే అంశాలపై సదస్సుల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం

ప్ర: సదస్సుల ద్వారా ప్రజల్లో చైతన్యం వస్తుందా?

జ: సదస్సులద్వారా ప్రజల్లో చట్టాలపై, పోలీసుల సెక్షన్లపై 0-70 శాతం అవగాహన కలుగుతుంది. అంతేకాకుండా చట్టాన్ని ధిక్కరిస్తే జరిగే పరిణామాలు కూడా వారిలో నేరధోరణిని తగ్గిస్తున్నాయి. చిన్న విషయాలకు ఘర్షణకు దిగే పరిస్థితి తగ్గుముఖం పట్టింది. అసాంఘిక కార్యక్రమాలపై ప్రజలే పోలీసులకు నేరుగా తెలియజేస్తున్నారు.

ప్ర: రోడ్డు ప్రమాదాల నివారణపై చర్యలు ఏంటి?

జ: గతంలో వాహన ప్రమాదాలు పెరిగిన మాట వాస్తవమే. ప్రస్తుతం వాటిని అదుపుచేసేందుకు కృషి చేస్తున్నాం. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సున్నితంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. అదే విధంగా మద్యం తాగి వాహనాలు నడిపే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపిస్తున్నాం. తప్పనిసరిగా డ్రైవింగ్‌లైసెన్స్ ఉంటేనే వాహనాలు నడపాలని గ్రామాల్లో ప్రజలకు సూచనలు చేస్తున్నాం. రాబోయే రోజుల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు ముమ్మరం చేసి ప్రమాదాల శాతాన్ని పూర్తిగా తగ్గించే ప్రయత్నం చేస్తాం.

ప్ర: బహిరంగ మద్యపానంపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: బహిరంగంగా మద్యం తాగడం చట్ట విరుద్ధం. దీనిపై ప్రజల్లో అవగాహన పెంచుతున్నాం. రాత్రులు పెట్రోలింగ్ నిర్వహించి మద్యం తాగే వారికి హెచ్చరికలు జారీ చేస్తున్నాం. తద్వారా కొంతమేర ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా మద్యం తాగే వారి సంఖ్య తగ్గుముఖం పట్టింది.

ఎమ్మెల్సీ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలి

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : శాసన మండలి ఓటు కోసం గ్రాడ్యుయేట్స్ అంతా దరఖాస్తు చేసుకోవాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కోరారు. కృష్ణా, గుంటూరు శాసన మండలి గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆయన ఆదివారం పట్టణంలో పలు చోట్ల గ్రాడ్యుయేట్స్‌ను కలిశారు. దరఖాస్తు సమర్పించేందుకు గడువు దగ్గర పడిందని, ఓటు కోసం దరఖాస్తు ఇవ్వని వారంతా ముందుకు రావాలన్నారు. నవంబరు 3 వరకు ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులు తీసుకుంటారని చెప్పారు. గ్రాడ్యుయేట్‌గా అర్హత సాధించిన ప్రతి ఒక్కరూ అప్లికేషన్, ఫొటోలు, ఆధార్, డిగ్రీ సర్టిఫికెట్‌ను సమర్పించాలన్నారు. ఆయనతో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదికి సన్మానం

పొన్నూరుటౌన్, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి) : పొన్నూరు పురపాలక సంఘం స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా నియమితులైన తూమాటి రమేష్‌ను ఆదివారం తెలుగుదేశం పార్టీ నాయకులు కలిసి సత్కరించారు. పొన్నూరు పట్టణంలో సీనియర్ న్యాయవాదిగా పేరున్న తూమాటి రమేష్ నోటరీగా సేవలందిస్తున్నారు. తాజాగా రమేష్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా నియమితులవటంపై పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నేతలు గోగినేని రజని కుమార్, పొట్టూరి హనుమత్ దుర్గా ప్రసాద్, షేక్ జానీ బాషా, గుంపుల విజయేంద్రరావు, ఖాదర్ జానీ, నరసింహారావు తదితరులు రమేష్‌ను సత్కరించారు.


సంచికను విడుదల చేస్తున్న లోకనాథశర్మ

అన్ని శాఖల బ్రాహ్మణులు ఐక్యం కావాలి

తెనాలి అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : అన్ని శాఖల బ్రాహ్మణులు ఐక్యం కావాలని, వివాహ విషయంలో శాఖా బేధాలు లేకుండా నిర్ణయాలు తీసుకోవాలని ఆలిండియా బ్రాహ్మణ వివాహ సమాచార కేంద్రాల సలహాదారు వై.లోకనాథ శర్మ చెప్పారు. స్థానిక నూకల రామకోటేశ్వరరావు కళ్యాణ మండపంలో ఆదివారం బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదికను నిర్వహించారు. తురుమెళ్ల దక్షిణామూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రూపొందించిన సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్చకత్వం, పౌరోహిత్యం నిర్వహించే వారికి వివాహాలు కాకపోవడం బాధగా ఉందన్నారు. ఉన్నత చదువులు చదివినా మూలాలను మరిచిపోకూడదన్నారు. వివిధ ప్రాంతాల నుంచి 750 కుటుంబాల వధూవరుల దరఖాస్తులను స్వీకరించారు. వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న 17 మంది ప్రముఖులను సన్మానించారు. ప్రకాష్‌రావు, శేషగిరి రావు, కిరణ్, ప్రకాష్, ప్రసాద్, విశ్వనాథ్ తదితరులు ప్రసంగించారు.